నిర్భయవార్త తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.com
http://nirbhayavaartha.com

# నిర్భయవార్త

తెలుగు దినపత్రిక

NIRBHAYA VARTHA TELUGU DAILY

**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న "నిర్భయవార్త" తెలుగు దినపత్రికకు జర్నలిజంపై ఆసక్తి కలిగి, అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సి ఇంచార్జీలు మండలాల వారిగా విలేకరులు కావలెను.

సంప్రదించండి

సెల్ : 7799013939

సంపుటి : 12 సంచిక : 308 రంగారెడ్డి | మంగళవారం 03 మార్చి 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To : ★ Hyderabad ★ Ranga Reddy ★ Nizamabad ★ Warangal ★ Mulugu ★ Shadnagar ★ Yadadri ★ Nalgonda ★ Karimnagar ★ Khammam ★ Medak ★ Sangareddy ★ Siddipet ★ Medchal ★ Jagityal ★ Vemulawada

## పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలి

### పీఏసీ సమావేశంలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు



వికారాబాద్, మార్చి 2 నిర్భయవార్త ప్రతినిధి: పీఏసీ సభ్యులతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భేటీ ముగిసింది. ఈ సమావేశంలో రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుర్మార్గాలన్నీ బయటపడుతున్నాయని తెలిపారు. మోదీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ సూచించారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా ఉండాలన్నారు.మోదీ ప్రభుత్వ చర్యల వల్ల ఇండియాలో యుద్ధం వచ్చే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో–అమెరికన్ ట్రేడ్ డీల్‌తో ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పార్టీ.. ప్రభుత్వం కలిసి మంచిగా పనిచేస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టాలని పార్టీ సీనియర్ నేత వీహెచ్ కోరగా.. అందుకు రాహుల్ సమ్మతి తెలిపారు.ఈ సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల పీఏసీ సభ్యులు పాల్గొన్నారు. రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, మహేష్ గౌడ్, వైఎస్ షర్మిల తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్.. ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి అనంతగిరి హరితా రిసార్ట్స్‌కు బయలుదేరారు. అక్కడ జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో రాహుల్, సీఎం రేవంత్ పాల్గొననున్నారు.

## రాహుల్‌ని ప్రధాని చేయడమే లక్ష్యం: రేవంత్



వికారాబాద్, మార్చి 02 నిర్భయవార్త ప్రతినిధి: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు.ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

## దుబాయ్‌లో చిక్కుకుపోయిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



దుబాయ్, ఫిబ్రవరి 02 నిర్భయవార్త : ఇరాన్–ఇజ్రాయెల్ మద్య భీకర యుద్ధ జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి రావాలని భావిస్తున్న సమయంలో పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆయన దుబాయ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇరాన్, ఆదివారం అర్ధరాత్రి దుబాయ్ ఎయిర్ పోర్ట్ (ణబఝుఙ ×త్వతీఅఫఆశీఝుశ్రీ ాాఅతీజూశీతీ)లోని టెర్మినల్ – 3 సమీపంలో క్షిపణి దాడులు జరినట్లు సమాచారం. భద్రతా కారణాలతో అక్కడ ప్రభుత్వం విమానా రాకపోకలు నిలిపివేశాయి. దీంతో మంత్రి తుమ్మల అక్కడే చిక్కుకుపోయారు.

సురక్షితంగానే ఉన్నా..

దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో అన్ని విమానాలను అక్కడ ప్రభుత్వం రద్దు చేయడంతో మంత్రి తుమ్మల దుబాయ్‌లోనే చిక్కుకుపోయారు. అయితే, తాను సురక్షితంగా ఉన్నానని, ఎయిర్ పోర్టు క్లియరెన్స్ ఇచ్చే వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితి అని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని తుమ్మల తెలిపారు.



# ఇరాన్.. ప్రతీకారం

## ఏక కాలంలో ఏడు దేశాలపై క్షిపణుల ప్రయోగం

- అమెరికా యుద్ధ నౌక అబ్రహం లింకన్‌పై డ్రోన్‌లతో ఎటాక్
- కువైట్‌లోని అమెజాన్ డేటా సెంటర్‌పై మిసైల్ ప్రయోగం
- సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలు టార్గెట్‌గా దాడులు
- అరబ్ దేశాల ఆర్థిక మూలాలపైకి డ్రోన్లు

పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ జరిపిన మిస్సైల్, డ్రోన్ దాడుల్లో యూఏఈలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ దెబ్బతింది. దీంతో అమెజాన్ తన సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది. కాగా ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్ ఏకంగా ఏడు గల్ఫ్ దేశాలపై గురిపెట్టింది. ఒకేసారి ఏడు దేశాలపై దాడులను ముమ్మరం చేసింది. ఖతార్, కువైట్, యూఏఈ, బహ్రెయిన్, దుబాయ్, అబుదాబి, సౌదీ అరేబియాలోని అమెరికా సైనిక స్థావరాలే టార్గెట్ గా డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. అలాగే దక్షిణ ఇజ్రాయెల్ పైడా ఖండాంతర క్షిపణులను ప్రయోగించింది

ఇరాన్, ఫిబ్రవరి 02 నిర్భయవార్త :

### అబ్రహం లింకన్‌పై దాడి

అరేబియా సముద్రంలో మోహరించిన అమెరికాకు చెందిన అణుశక్తి ఆధారిత విమాన వాహక యుద్ధ నౌక " అబ్రహం లింకన్'పై దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ మీడియా ప్రకారం.. ఈ యుద్ధనౌకపై 4 క్షిపణులతో దాడి జరిగినట్లు చెప్పింది. ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 4లో భాగంగా ఈ దాడి జరిగినట్లు చెప్పింది. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలను వదిలిపెట్టేది లేదని ఇరాన్ హెచ్చరించింది. అయితే, అమెరికా రక్షణ శాఖ ఈ దాడిని అధికారికంగా ధ్రువీకరించలేదు.

### కువైట్‌లోని అమెజాన్ డేటా సెంటర్ పై దాడి

తాజాగా కువైట్, యూఏఈ, సౌదీ ఆరేబియా లక్ష్యంగా ఇరాన్ జరిపిన దాడులు ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. అమెజాన్ క్లౌడ్ విభాగం తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున యూఏఈలోని డేటా సెంటర్ ని మిస్సైల్ బలంగా ఢీకొట్టింది. దీనివల్ల డేటా సెంటర్‌లో ఒక్కసారిగా నిప్పురవ్వలు చెలరేగి.. భారీగా మంటలు వ్యాపించాయి. స్థానిక అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే క్రమంలో ముందుజాగ్రత్త చర్యగా ఆ సెంటర్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేసి, కార్యకలాపాలను పూర్తిగా మూసివేసినట్లు అమెజాన్ ధ్రువీకరించింది.



### తగ్గేది లే అంటున్న ఇరాన్

మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ మేఘాలు ఇరాన్ తన దాడుల పరిధిని పెంచింది. కేవలం ఇజ్రాయెల్ మాత్రమే కాకుండా, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ విరుచుకుపడుతోంది. యూఏఈలోని అల్ ధఫ్రా ఎయిర్ బేస్, దుబాయ్‌లోని జబేయ్ అలీ పోర్ట్ వంటి కీలక ప్రాంతాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. ఈ క్రమంలోనే విమానాశ్రయాలు, రేవులు, నివాస ప్రాంతాలపై జరిగిన దాడుల ప్రభావంతో అమెజాన్ డేటా సెంటర్ కూడా మంటల్లో చిక్కుకుంది. దుబాయ్, అబుదాబి నగరాల్లో పేలుళ్ల శబ్దాలు విన్నామని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కువైట్‌పై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడ్డ ఇరాన్ సోమ వారం తెల్లవారుజామున ఇరాన్ భారీ ఎత్తున విమాన దాడులకు తెగబడింది. కువైట్ , సౌదీలోని భూభాగాలపై ఇరాన్ ఏకకాలంలో 97 క్షిపణులు, 283 డ్రోన్లతో దాడికి దిగింది. ప్రధానంగా చమురు క్షేత్రాలు, సైనిక స్థావరాలు, కీలక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు సమాచారం. కువైట్ గగనతలం పేలుళ్ల శబ్దాల తో దద్దరిల్లిపోయింది. ఈ స్థాయిలో దాడులు జరగడం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారి.

### డేటా సెంటర్ మూసివేస్తే

డేటా సెంటర్లు అనేవి ఇంటర్నెట్ ప్రపంచానికి వెన్నెముక వంటివి. ఇక్కడ లక్షలాది కంప్యూటర్ సర్వర్లు నిరంతరం పనిచేస్తూ ప్రపంచవ్యాప్తంగా వెబ్‌సైట్లు, యాప్‌లు, ఆన్‌లైన్ సేవలను నడిపిస్తాయి. ఈ ఘటన వల్ల అమెజాన్ కి చెందిన నెట్‌వర్కింగ్, డేటాబేస్ సేవలకు అంతరాయం కలిగింది. ఈ సెంటర్ మూతపడటంతో మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో ఇంటర్నెట్ సేవలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఫుడ్ డెలివరీ యాప్స్, క్లౌడ్ ఆధారిత అప్లికేషన్లు నెమ్మదించాయి. వినియోగదారులు ఇతర ప్రాంతాలలో ఉన్న సర్వర్లను వాడుకోవాలని అమెజాన్ సూచించింది.

### యుద్ధంలో ఆంథ్రోపిక్ ఏఐ సేవలు

మరోవైపు ఇరాన్ దాడుల కోసం అమెరికా ఆంత్రోపిక్ ఏఐ సేవలు వంటి అధునాతన సాంకేతికతను వాడుతోందనే వార్తలు కూడా టెక్ ప్రపంచంలో కలకలం రేపుతున్నాయి. ప్రస్తుతానికి ఈ ప్రాంతంలో విమానాల రాకపోకలను నిలిపివేశారు. పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉండటం తో టెక్నాలజీ దిగ్గజాలు తమ మౌలిక సదుపాయాల భద్రతపై ఆందోళన చెందుతున్నాయి. యూఏఈలో దాదాపు 35 లక్షల మంది భారతీయులు ఉన్నారు, అందులో తెలుగు వారు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ యుద్ధ వాతావరణం, ఇంటర్నెట్ అంతరాయం వారి జీవనశైలిని, కమ్యూనికేషన్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది.

నిర్భయవార్త


సంపాదకీయం

మంగళవారం 03, మార్చి 2026

# తొలి తెలంగాణా కవి పంపన

రెండవ అరికేసరి ఆస్థానకవిగా, వేములవాడ ప్రాంతంలో జన్మించి కన్నడ ప్రాంతానికి వలస వెళ్ళి, పాండిత్యాన్ని సాధించి కన్నడ భాషకి సాహిత్య ప్రతిపత్తి ఇవ్వడానికి ఆదికవిగా రచనలు చేసిన తెలంగాణ కవి పంపన! అలాంటి పంపన రాసిన పద్యాలు తెలుగులో కూడా లభిస్తున్నప్పటికీ ఆయన రాసిన కావ్యాలు అలభ్యంగా ఉండటం తెలుగు సాహిత్యానికి తీరని లోటు. శాలివాహన శకం 9వ శతాబ్దం లోనే తెలుగు భాషలో అత్యంత అద్భుతమైన పాండిత్యాన్ని గడించి దానికి కావ్యగౌరవం ఇచ్చే లాగా కావ్యాలెన్నో రాసి, గ్రంథస్థం చేసి, శాసనాలలో తన పాండితీ ప్రకర్షని ప్రదర్శించి బొమ్మలమ్మ గుట్ట, కురక్యాల శాసనంలోని తొలి తెలుగు కందపద్యాలలో తన రచన "విక్రమార్జున విజయం" గురించి ప్రస్తావన సాధించిన పంప మహాకవి తెలుగు సాహిత్యపు తొలి కవి అని చెప్పవచ్చు. ఆయన రాసిన 'పంప భారతం' 1100 ఏళ్ళ తర్వాత పూర్తి అర్థ తాత్పర్య సహితంగా దాదాపు 1700 పేజీలతో పూర్తి తెలుగు అనువాదంగా ఇటీవల శాంత వసంత ట్రస్ట్ వరప్రసాద్ రెడ్డి ప్రచురించారు. అక్షరయాన్ రచయిత్రుల వేదిక స్థాపకురాలు, కవయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి పూనికతో, భాషావేత్త డాక్టర్ జోస్యుల సదానంద శాస్త్రి ఇతర నిపుణులతో కలిసి దాదాపు నాలుగేళ్ళ పాటు శ్రమించి అనువదించగా, నాళేశ్వరం శంకరం, మామిడి హరికృష్ణ, పొన్నం రవిచంద్ర సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ఇప్పుడు పంపన, విక్రమార్జున విజయం గ్రంథ విశేషాలు మళ్ళీ చర్చకు వచ్చాయి. మహాకవి పంపన వంశానికి సంబంధించిన చారిత్రక, శాసనపరమైన, గ్రంథ పరమైన ఆధారాలను అనుసరించి చూస్తే చాలా విషయాలు వెల్లడవుతాయి. మల్లియ రేచన రాసిన 'కవిజనాశ్రయం', పంపన రాసిన 'ఆదిపురాణం', 'విక్రమార్జున విజయం' కావ్యాలలో ప్రస్తావించిన పద్యాలను అనుసరించి పంపన వంశక్రమం గురించి ఈ విధంగా చెప్పవచ్చు: యజ్ఞయాగాది క్రతువులలో నిపుణుడైన మాధవ సోమయాజి పంపన వంశానికి సంబంధించి మనకు లభిస్తున్న తొలి ప్రధాన వ్యక్తిగా గమనించవచ్చు. ఆయన కుమారుడు అభిమాన చంద్రుడు, ఆయన కుమారుడు కొమురయ్య వేదవేదాంగ పారంగతుడిగా ప్రసిద్ధి గాంచిన వ్యక్తి. ఆయన కుమారుడు 'భీమపయ్య'. ఆయన సతీమణి 'అబ్బణబ్బె'. వారి కుమారుడు పంపన. ఈ విషయాలన్నీ జినవల్లభుడి 'కురిక్యాల శాసనం'లో ప్రస్తావిస్తూ, మరొకవైపున 'భీమ తనుజం సమ్యక్త్వ రత్నాకరం పంపర్యానుజుడు' అని జినవల్లభుడి గురించి, జినవల్లభుడికి పంపనకి ఉన్న సోదరత్వాన్ని గురించి ఈ శాసనంలో ప్రస్తుతించడం జరిగింది. అలాగే 'కవిజనాశ్రయం'లో భీమన/ భీమపయ్య ప్రసక్తి ఉంది. "ఆ భీమనాగ్రసుతుడే పంపన" అని పివీ పరబ్రహ్మశాస్త్రి లాంటి చరిత్రకారుడు కూడా తమ పరిశోధనలో నిర్ధారించారు. ఈ విషయాలకి సంబంధించి 'కవిజనాశ్రయం'లో ఒక చోట:"పరిగిన విమలయశో భాసుర చరితుడు భీమనాగ్ర సుతుడఖిల కళాపరిణతుడయ్యును భూసురవర ప్రసాదోదిత ధ్రువ శ్రీయుతుడై" అని ప్రస్తావించారు. దీంట్లో 'భీమనాగ్ర సుతుడు' అంటే పంపన అని అర్థమవుతుంది. కాగా పంపన పూర్వీకుల గురించిన విషయానికొస్తే వారు మొదట 'వెంగిపళు' అనే ప్రాంతం నుండి నేటి తెలంగాణ ప్రాంతం (అప్పట్లో సబ్బినాడు)కు వలస వచ్చారని తెలుస్తోంది. అలాగే 'ఆదిపురాణం' ప్రథమాశ్వాసంలో 28, 29, 32 వ పద్యాలలో పంపన తనే స్వయంగా తన రూపు రేఖలు, గుణాల గురించి చెప్పుకోవడం విశేషం. ఈ పద్యాలలోని విషయాలను అనుసరించి పంపన శ్రీవత్స గోత్రీకుడని, దుందుభి నామ సంవత్సరంలో జన్మించాడని, వంకర తిరిగిన శిరోజాలతో, పద్మం లాంటి ముఖంతో సుందరంగా ఉండేవాడని చెప్పుకున్నాడు. ఈ దుందుభి నామ సంవత్సరం శాలివాహన శకం 902 తో సరిపోతుంది. కనుక ఈ ఆధారాలను అనుసరించి పంపన 902 వ సంవత్సరంలో జన్మించాడని నిర్ధారణ అవుతుంది. అలాగే పంపన సోదరుడు గురించిన విషయాలు కూడా కురిక్యాల శాసనం ద్వారా వెల్లడవుతున్నాయి. జినవల్లభుడు ఆయన సోదరుడుగా కురిక్యాల శాసనంలోని కందపద్యం స్పష్టం చేస్తుండగా, ఆనాటి చాళుక్యరాజు అరికేసరి ప్రభువుకి అనుంగు సహచరుడిగా పంపన గురించి తెలుస్తోంది. ఇక ఆనాటి కాలంలో సాధారణంగా కవులు, సాహితీవేత్తలు జైన మతావలంబకులుగా ఉంటే, ప్రభువులు వైదిక మతాన్ని ప్రోత్సహించిన వారిగా ఉండటం విశేషం. అలాగే కవి కాలాదులను నిర్ధారించడానికి ఆయా రాజులు, చక్రవర్తులు, వారి పరిపాలన కాలాన్ని తీసుకోవడం సాధారణంగా చరిత్రకారుల కొలమానంలో కనిపిస్తుంది. ఆ లెక్కన చక్రవర్తి అరికేసరి వంశ వివరాలను పరిశీలిస్తే, దానికి మూడు ఆధారాలు మనకు లభిస్తున్నాయి. అవి: (1) 'విక్రమార్జున విజయం' లోని విషయాలు. (2) వేములవాడ శాసనంలో నిక్షిప్తమైన అంశాలు. (3) ఫరబణి తామ్ర శాసనంలో లిఖించిన అంశాలు. వీటి ఆధారంగా చాళుక్య వంశంలో మొదటి రాజు, యుద్ధమల్ల అనీ, ఎనిమిదవ రాజు రెండవ అరికేసరి అని మనకు స్పష్టంగా తెలుస్తోంది. ఆ లెక్కన రెండవ అరికేసరికి సమకాలికులుగా జినవల్లభుడు, ఆయన సోదరుడు పంపన ఉన్నారని కూడా వెల్లడి అవుతోంది. మరొకవైపున పంపన జైన మతాన్ని స్వీకరించిన వ్యక్తిగా ఆధినాథుని కథతో 'ఆదిపురాణం' రాసాడని, చక్రవర్తి రెండవ అరికేసరితో తనకు ఉండే ఆత్మీయబంధానికి సాహిత్య రూపంగా 'విక్రమార్జున విజయం' కూడా రాసాడని తెలుస్తోంది. పంపనకు, బోధన్‌కు ఉన్న అనుబంధం గొప్పది. 'విక్రమార్జున విజయం' లోని (3.22) తృతీయాశ్వాసం లోని అంశాలను గమనిస్తే ఇది స్పష్టంగా తెలుస్తుంది. ఈ ఆశ్వాసంలో పంపన ఏకచక్రపురం నగరాన్ని వర్ణిస్తాడు. ఆ వర్ణన లోని విశేషాలను బట్టి ఈ నగరానికి పూర్వం బహుధాన్య పురి, పోదన పురి, బోధన పురి, భక్తి పురం, చక్ర పురం అనే పేర్లు ఉండేవనీ మహాభారతంలోని 'బకాసుర వధ' ఘట్టం ఇక్కడే జరిగిందని ఈ రచన వల్ల తేటతెల్లమవుతోంది. కాగా ఈ నగరంలో పంపన చాలా కాలం నివాసం ఉన్నట్లు తృతీయాశ్వాసం లోని పద్యాలలో తన వ్యక్తిగత అనుభవాన్ని కూడా తెలియజేస్తాడు. పంపనకు ఎన్నో బిరుదులు ఉన్నాయి. అందులో ఒక బిరుదు 'కవిత గుణార్ణవ'. అయితే అప్పట్లో వ్యక్తులు బతికున్న, చనిపోయినవారి పేరిట దేవాలయాలను, చెరువులను నిర్మించే సంప్రదాయం ఉండేది. పోదన పురి లోని తామ్ర శాసనంలో పంపన గురించి, అక్కడ నిర్మించిన తటాకం గురించి 'కవితా గుణార్ణవ తటాకం' అనే పేరుతో ప్రస్తావించడం జరిగింది. అంటే పంపన మరణానంతరం పోదన పురిలో ఆయన పేరిట చెరువు నిర్మాణం జరిగిందని భావించవచ్చు అని చరిత్రకారుల అభిప్రాయం. దీన్నిబట్టి పంపనకు బోధన్‌తో చెరపలేని అనుబంధం ఉన్నదని నిరూపణ అవుతున్నది. పై పరిశీలనల ఆధారంగా తెలుగు సాహిత్య చరిత్రలో నన్నయ కన్నా శతాబ్ద కాలం ముందే తెలంగాణా సాహిత్య చరిత్ర మొగ్గ తొడిగిందని, తెలంగాణ తొలి కవిగా పంపన నిలుస్తున్నాడని చెప్పవచ్చు.

# త్రిశూలాల వ్యూహానికి చావుదెబ్బ




ఢిల్లీ లిక్కర్ కేసులో మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో సహా 23 మంది నిందితులపై ఆరోపణలు కొట్టివేస్తూ రౌస్ అవెన్యూ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పు దేశాన్ని కుదిపేసింది. మరీ ముఖ్యంగా త్రిశూల వ్యూహంతో ప్రతిపక్షాలపై ఇడి, సిబిఐ, ఐటి లను ఉసిగొల్పుతున్న మోడీ సర్కారుకు షాక్ తగిలింది. తెలుగు రాష్ట్రాల రాజకీయాలపై మరో విధంగా సెగ తగిలింది. ఎందుకంటే రెండు రాష్ట్రాలలో అప్పుడూ ఇప్పుడూ పాలక పార్టీలలో, కూటములలో వున్న రాజకీయ నేతల గతం, భవితవ్యం ఈ కేసుతో ఎంతగానో ముడిపడి నడిచాయి. అప్పుడూ ఇప్పుడూ అవినీతి కేసులు ఎదుర్కొంటున్న నేతలపైనా ఈ తీర్పు ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న అంచనాలు కూడా వున్నాయి. సిబిఐ ఎలాగూ ఢిల్లీ కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీలు చేస్తానని ప్రకటించింది. 2009 నాటి 2జి కేసు ఇంకా ఒక కొలిక్కిరాని పరిస్థితిలో లిక్కర్ స్కామ్ ఇప్పటికిప్పుడు ఏదో తేలిపోతుందన్న అభిప్రాయం ఎవరికీ లేదు. అంటే ఏళ్ల తరబడి సాగే జాబితాలో మరో కేసు చేరుతుందన్న మాట. తీర్పు వచ్చాక అరవింద్ కేజ్రీవాల్ తన నిర్దోషిత్వం నిరూపితమైందని కన్నీటి పర్యంతమవడం చూశాం. ఈ తప్పుడు కేసు మోపి శాసనసభ ఎన్నికల్లో తమను దుష్ప్రచారాలతో ఓడించిన బిజెపి ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు సిద్ధమా అని ఆయన సవాలు చేశారు. బిఆర్ఎస్ మాజీ నేత, కెసిఆర్ కుమార్తె కవిత కూడా న్యాయం జరిగిందని చెప్పడం ఒకటైతే మాతృ సంస్థతో కుటుంబంతో ఆమె రాజకీయ వివాదం రకరకాల రూపాల్లో వ్యక్తమవుతున్న స్థితి. 2023 చివర జరిగిన ఎన్నికల్లో తమపై వ్యతిరేక ప్రచారానికి బిజెపి ఈ కేసు కారణమైందని కేజ్రీవాల్ లాగే కెటిఆర్ కూడా అనడాన్ని కవిత తప్పు పట్టడం ఆశ్చర్యమే. ఎందుకంటే బిఆర్ఎస్ కీలక నేతల తప్పిదాలు చాలా వున్నప్పటికీ లిక్కర్ స్కామ్ ప్రభావమే లేదనడం బిజెపి వాదనకు దగ్గరగా వుంటుంది. ఇక ఎ.పి పాలక కూటమి నేతలు ఇంతవరకూ దీనిపై నోరు విప్పిన దాఖలాలు లేవు. వివిధ మీడియాలు కూడా వాటి వాటి తీరును బట్టి స్పందించడం ఊహించిందే.

**రాష్ట్రాధినేతలతో చెలగాటం** దేశ చరిత్రలో తొలిసారిగా ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేయడంతో నరేంద్రమోడీ ప్రభుత్వ నిరంకుశత్వం పరాకాష్టకు చేరింది. జయలలిత, లాలూ ప్రసాద్ యాదవ్, శిబు సోరేన్, మధు కోడా తదితరులు రకరకాల సందర్భాల్లో వివిధ కేసులలో జైలుకు వెళ్లిన మాట నిజమేగానీ వారు పదవులకు రాజీనామా చేసి లేదా కోల్పోయి వెళ్లారు. ఇక్కడ అధికార హోదాలోనే వెళ్లడం ఇదే తొలిసారి. లిక్కర్ స్కాం అనే దర్యాప్తులో వరుసగా అనేకమందిని అరెస్టు చేయడం ఒక ఎత్తయితే ఎన్నికల ప్రకటన జరిగాక రాజ్యాంగ పదవిలో వున్న అది కూడా దేశ రాజధాని ప్రాంతాన్ని పాలిస్తున్న కీలక నేతను వెంటబడి నిర్బంధించడం రాజ్యాంగ విలువలకే ప్రమాదమైంది. దానికి ముందు జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను కూడా అలాగే అరెస్టు చేశారు. ఇదే ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ శిసోడియా అప్పటికే జైలులోనే వున్నారు. సిబిఐ, ఇడి లను ఫెడరల్ ఏజన్సీలు (కేంద్ర సంస్థలు) అని సంబోధిస్తుంటారు. వీటికి ఆదాయపు పన్ను శాఖ ఐటిని జోడించి ప్రత్యర్థులపై ప్రయోగించడమే త్రిశూల వ్యూహంగా పేరొందింది. హిందుత్వ త్రిశూల రాజకీయాలకు తోడైంది. లిక్కర్ వ్యవహారంలో ఏం జరిగిందనేదానికీ కేజ్రీవాల్ అరెస్టుకూ ఏ సంబంధం లేదు. ఆప్ అధినేతగా ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ దీనికి బాధ్యత వహించవలసి వుంటుందని సుప్రీం కోర్టులో ఇడి అధికారులు వాదించారు. ఆప్ పార్టీని ఒక కంపెనీగా అభివర్ణించారు. మనీ లాండరింగ్ యాక్ట్ సెక్షన్ 4లో కంపెనీది బాధ్యత అన్నారు గనక ఆప్ నాయకుడుగా కేజ్రీవాల్ శిక్షార్హుడనేది వారి ఏకైక వాదన. అప్రూవర్లుగా మార్చుకున్న వారు ఇచ్చిన సాక్ష్యాలంటూ కొన్ని చూపించారు. అప్పట్లో వైసిపి ఎంపీగా వుండి తర్వాత టిడిపిలో చేరిన లిక్కర్ వ్యాపారాధినేత మాగుంట శ్రీనివాసరెడ్డి తాను కేజ్రీవాల్‌ను కలుసుకుని లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనాను కలుసుకోవడం కోసం లేఖ రాయించుకున్నానని చెప్పినదాన్నే సాక్ష్యంగా చూపారు. వాస్తవానికి ఒక ఎంపీగా ఆయన పదే పదే కలవాలని అడిగిన మీదట ఒక ట్రస్టు ఏర్పాటుపై లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలవడానికి లేఖ ఇచ్చి పంపాననీ దానికి దీనికీ ఏ సంబంధం లేదని కేజ్రీవాల్ చెబుతూనే వచ్చారు. విధాన నిర్ణయాల్లో తప్పొప్పులు, వాటి వల్ల లబ్ధిదారులు ఎవరనేది ఒకటైతే ఆ సాకుతో ఏ నిర్దిష్ట ఆధారాలు లేకుండా చెప్పుడు కథనాలతో క్విడ్ ప్రోకో పేరిట ఎలా రాజ్యాంగ పదవిలో వున్నవారిని అరెస్టు చేస్తారని జడ్జి జితేంద్ర సింగ్ గడ్డిపెట్టారు. పైగా ఈ చెప్పేవారు కూడా నిందితులో జరిగినదాంట్లో భాగస్వాములో అయినప్పుడు అసలు ఆ మాటలకు విలువెంతని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో చేసుకునే రాజకీయ ఆరోపణలను న్యాయపరమైన ఆధారాలుగా చూపిస్తే కోర్టులు ఎలా సంతృప్తి చెందుతాయని వ్యాఖ్యానించారు. కవితకు సంబంధించి కూడా అరబిందో కంపెనీ శరశ్చంద్రారెడ్డితో లావాదేవీలు, ఇచ్చి పుచ్చుకోవడాలు బ్యాంకు ఖాతాలలో అధికారికంగా జరిగినప్పుడు దర్యాప్తు చేసి తేల్చిందేమిటని కూడా అడిగారు. అన్నిటినీ మించి సౌత్‌గ్రూప్ (దక్షిణాది బృందం) ఇచ్చిన పత్రం మేరకే లిక్కర్ విధానం తయారైందని ఎలా ఎక్కడ నిరూపించలేదని కూడా ఆక్షేపించారు. ఇలాంటి అనేక కారణాల వల్ల కేసు నిలిచేది కాదని దర్యాప్తు సంస్థలు రాజకీయ సాధనాలు కాకూడదని జడ్జి అన్న మాట చాలా కాలంగా ప్రతిపక్షాలు, న్యాయకోవిదులు హెచ్చరిస్తున్నదే. ఇందుకుగాను దర్యాప్తు అధికారులపై శాఖాపరమైన చర్య తీసుకోవాలని కూడా జడ్జి ఆదేశించారు.

**ఆప్ పై అదే కక్ష**

మామూలుగా ఒక ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేయాలంటే గవర్నర్ అనుమతి తప్పనిసరి. ఢిల్లీకి లెఫ్టినెంట్ గవర్నర్ వుంటారు. అయితే ఆయనే స్వయంగా కేజ్రీవాల్ ప్రభుత్వంపై కేసు పెట్టాలని ఆదేశించడంతో అనుమతి ప్రశ్న లేకుండా పోయింది. ఆ తర్వాత కాలంలో చాలా ఉత్తర ప్రత్యుత్తరాలు, విచారణలు జరిగినా నిర్దిష్టంగా నిరూపితమైంది లేదు. కేజ్రీవాల్ వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆధారాలేమీ లేవు. అసలు ఈ స్కామ్ అనబడేదాని ద్వారా వచ్చిందని చెబుతున్న మొత్తం వంద కోట్లు, ఇతరత్రా కలిపి ఇది రెండు వందల కోట్లు చూపిస్తున్నారు. వందలో నలభై కోట్లు గోవాలో ఎన్నికల కోసం పంపించారని ఆరోపణ. తన కంచుకోట వంటి ఢిల్లీలో చోటు లేకుండా చేయడమేగాక నెమ్మదిగా గుజరాత్‌లోనూ గోవాలోనూ కూడా సవాలు చేశారనేది ఆప్ పై బిజెపి ప్రత్యేక కక్ష. దేశమంతా తాము పాలిస్తుంటే ఆ పాలన జరిగే చోటును మరెవరో పాలించడం మోడీ బృందం ఎన్నడూ భరించలేకపోయారు. మధ్యతరగతి మద్దతుతో పట్టణ ప్రధానమైన సంస్కరణలతో కొంత సమాంతర పాలన అందించిన ఆప్ దేశ రాజకీయ పటంలో ఒక స్థానం సంపాదించుకుంది. నిజానికి ప్రాంతీయ పార్టీగా మొదలై జాతీయ పార్టీగా ఎదిగిన ప్రత్యేకత దానిది. చాలా ప్రాంతీయ పార్టీలలో వలె ఒక నాయకుడి కుటుంబమే చక్రం తిప్పే సంస్కృతి ఆప్‌లో లేకపోవడం ఒక విశేషం. కేజ్రీవాల్ పాత్రనే ప్రధానంగా వున్నా పంజాబ్‌లో గెలిచిన తర్వాత అదీ కొంత మారింది. ఢిల్లీ ఓటర్లు కూడా శాసనసభకు ఆప్‌నూ లోక్‌సభకు బిజెపిని గెలిపిస్తూ మిశ్రమ చిత్రం సృష్టించారు. ఈ ద్వంద్వత్వం చాలా కాలం ఆప్ పైనా ప్రభావం చూపింది. కేజ్రీవాల్ ఆంజనేయ దండకంతో సహా కొన్ని ప్రయోగాలు చేశారు. కానీ బిజెపికి లోబడిపోతే భవిష్యత్తు వుండదనే వాస్తవం ఆయన గ్రహించగలిగారు. అందుకే తమపై దాడిని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు వివరించడానికి ఆయన దేశమంతా పర్యటించారు. ఇండియా వేదికతో సహా పలు ప్రతిపక్ష సమావేశాలకు హాజరైనారు. కేంద్ర నిరంకుశత్వంపై పోరాటంలో పాలు పంచుకున్నారు. ఇవన్నీ సహజంగానే మోడీకి మింగుడు పడలేదు. పైగా కేజ్రీవాల్ రాజకీయాలకు తన భక్తిని జోడించి గుళ్లు కూడా తిరగడం మరింత ఆందోళన కలిగించింది. మౌలికంగా అవినీతిపై పోరాటం నినాదంతో పుట్టి పెరిగిన ఆప్ నేతపైనే ఆరోపణలు తెచ్చి అడ్డు తొలగించుకోవడానికి ఇది పూర్వ రంగం. ఈ సమయంలో కాంగ్రెస్ కూడా మోడీ క్రీడకు వంత పాడటంతో ఢిల్లీ మళ్లీ బిజెపి వశమైంది. ఇప్పుడు కేసు కొట్టివేసిన తర్వాత కూడా కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరా బిజెపికి సానుకూలంగా వుండటం వల్లనే కేజ్రీవాల్‌ను వదలివేశారని ఆరోపిస్తున్నారు! కేరళలో వామపక్ష ప్రభుత్వంపైనే అలాంటి ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్‌కు ఇదేమంత పెద్ద విషయం? బిజెపి మత రాజకీయాలపై ఏకోన్ముఖ పోరాటం కన్నా స్వప్రయోజనాలకే ఆ పార్టీ పెద్ద పీట వేయడం జరుగుతూ వస్తున్నది. మోడీ కేరళలోనూ ఇలాగే చేయబోయి భంగపడ్డారని గుర్తుపెట్టుకోవాలి.

**ద్వంద్వనీతికి శృంగభంగం**

2024లో కేజ్రీవాల్ అరెస్టుకు ముందు రోజే న్యూస్18 సమిట్‌లో మాట్లాడుతూ మోడీ కేంద్ర సంస్థలు చర్యలు తీసుకోలేదని అంతకు ముందు అనేవారనీ, తన హయాంలో చర్య తీసుకుంటే గోల చేస్తున్నారని అపహాస్యం చేశారు. ఆయన హయాంలో అవినీతి పేరిట అరెస్టు చేసిన వారిలో 95 శాతం ప్రతిపక్షానికి చెందినవారే. అదే తమతో కలిస్తే 'వాషింగ్ పౌడర్ నిర్మా' అని చలోక్తి కూడా పుట్టింది. ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపికి వేల కోట్లకు పైన వచ్చినట్టు అధికారికంగా వెల్లడైంది. సరిగ్గా ఏ సంస్థలపైన ఇడి, సిబిఐ, ఐటి దాడులు జరిగాయో వాటినుంచే వందల వేల కోట్లు బిజెపి కి ముట్టాయని లెక్కలతో సహా తేలింది. ప్రధానికి సన్నిహితుడైన గౌతం అదానీ నిర్వాకాలపై అంతర్జాతీయ నివేదిక వస్తే విచారణ చేయకుండా మరింత వెసులుబాటు కల్పించారు. అమిత్ షా తనయుడైన జైషాపై ఆరోపణలు వస్తే ప్రచురించిన మీడియాపై చర్య తీసుకున్నారు. ఇప్పుడు అమెరికాలోనే అదానీ కంపెనీపై ఆరోపణల పరంపర వస్తే అడ్డుచక్రం వేశారేగానీ చర్య తీసుకోలేదు. ఎప్‌స్టీన్ ఉదంతంలో బయటపడిన వారిపై చర్య కాదు కదా చర్చ కూడా లేదు. ఎన్నికల సంఘం కూడా వారి కనుసన్నల్లో పని చేసే పద్ధతి తీసుకొచ్చి సర్, ఓట్ల తారుమారు ఆరోపణలతో రాజ్యం నడిపిస్తున్నారనే విమర్శలు ఖాతరు చేయడం లేదు. సుప్రీం కోర్టు మాజీలకు పదవులిచ్చి, మరికొందరిని అదరగొట్టి న్యాయాన్ని తమకు అనుకూలంగా మల్చుకున్నారు. అసలు న్యాయ వ్యవస్థపైనే అవినీతి ముద్రతో పాఠం చెప్పాలనుకుని దెబ్బతిన్నారు. ఈ మొత్తం నిరంకుశత్వ పోకడ, ప్రజాస్వామ్యంపై దాడి ప్రత్యక్ష ప్రసారంలా జరిగిందే. ఇప్పటికైనా దానికి జడ్జి జితేంద్ర సింగ్ ధైర్యంగా అడ్డుకట్ట వేశారు. తర్వాత ఏం జరుగుతుందనేది మరో కథ. ఆంధ్ర, తెలంగాణలతో సహా వివిధ చోట్ల నడుస్తున్న రాజకీయ అవినీతి కేసులు ఏవి ఎలా ముగుస్తాయనేది చూడవలసిందే. ఇక ఢిల్లీ హైకోర్టులో సిబిఐ వాదనలు, తీర్పులు ఎలా వుంటాయనేది వెండి తెరపై చూడవలసిందే.

# కుల గోత్రాలు

భారతీయ సమాజాన్ని పట్టి పీడిస్తున్న భయంకర వ్యాధి కులం. ప్రపంచంలో ఇటువంటి కులవ్యవస్థ ఏ దేశంలోనూ లేదు. ఇక్కడి కులాధిపత్యం ఒక సామాజిక, మానసిక రుగ్మత. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లవుతున్నా ఇప్పటికీ కోట్లాది మంది అంటరానితనం, కులవివక్షతో అణచివేయబడుతూనే వున్నారు. తరాలు మారుతున్నా... కులం పేరుతో జరుగుతున్న హత్యలు ఆగడంలేదు. వేరే కులం అబ్బాయిని పెళ్లి చేసుకుంటే, రక్తసంబంధీకులే తమ వారి రక్తం కళ్లజూస్తూ... ప్రాణాలు హరించివేస్తున్న అమానవీయ ఘటనలు దేశవ్యాప్తంగా కోకొల్లలు. ఈ కుల వ్యవస్థ క్రూరత్వాన్ని కప్పిపుచ్చే అందమైన ముసుగు 'పరువు'. వేర్వేరు కులాల యువతీ యువకుల మధ్య చిగురించే ప్రేమను పరువు పేరుతో రాక్షసంగా చిదిమేస్తున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 వ్యక్తిగత స్వేచ్ఛతో స్వతంత్రంగా జీవించే హక్కు కల్పించగా, ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిషేధించింది. ఈ దేశం కుల రహిత సమాజంగా రూపొందాలని, ప్రజల మధ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు తొలగిపోవాలని రాజ్యాంగం ఉద్బోధిస్తోంది. అయినా, అది సుదూర స్వప్నంగానే వుంది. తెలుగు రాష్ట్రాల్లోనూ కుల దురహంకార హత్యల కలకలం తరచూ రేగుతూనే వుంది. తమ ఇంటి ఆడబిడ్డ వేరే కులానికి చెందిన అబ్బాయితో మాట్లాడిందనో, ప్రేమించిందనో, పెళ్లి చేసుకుందనో ఆమెను కర్కశంగా హతమారుస్తున్న దురహంకారులకు దేశంలో కొదువ లేదు. అమ్మాయిలు విద్యావంతులైనా, ఉద్యోగులైనా వారి అభిప్రాయాలకు కించిత్ విలువనివ్వని దుస్థితి ఈ ఆధునిక యుగంలోనూ రాజ్యమేలుతూనే ఉంది. ముఖ్యంగా వివాహ విషయంలో అబ్బాయిలకు ఉన్న స్వేచ్ఛ అమ్మాయిలకు లేదు. డిప్యూటీ తహశీల్దారు హోదాలో వున్న మహిళ కూడా తన ప్రేమను సఫలం చేసుకోలేకపోయిందంటే, కులం కుదుళ్లు ఎంత బలీయంగా వున్నాయో అర్థం చేసుకోవచ్చు. వేరే సామాజిక తరగతికి చెందిన వ్యక్తిని ప్రేమించి పెళ్లాడిందన్న అక్కసుతో చెల్లెలి భర్తను అత్యంత దారుణంగా రాళ్లతో కొట్టి హతమార్చిన ఉదంతం తాజాగా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరిగింది. వాళ్లేమీ చిన్నవయసు వారు కాదు. నలభైయేళ్ల వయసులో ప్రపంచ పోకడలను అర్థం చేసుకున్న జంట. వధువు ప్రభుత్వ అధికారి. ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకున్నారు. 24 గంటలు గడవక ముందే... వధువు సోదరులు వరుడి ఇంటికెళ్లి అతి కిరాతకంగా రాళ్లతో దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కుల దురహంకారం ఎంత తీవ్రంగా వుంటుందో ఈ సంఘటన మరో సారి వెల్లడించింది. స్త్రీ తన భాగస్వామిని ఎన్నుకునే హక్కు రాజ్యాంగం కల్పించినా... మన కులవ్యవస్థ దానికి అవరోధంగా మారింది. కుల తత్వంతో కన్న బిడ్డలనో, వారి భర్తలనో నిర్దాక్షిణ్యంగా చంపుతున్నారంటే, మనం ఏ కాలంలో వున్నామో అర్థం కాని పరిస్థితి. ప్రతి కుల దురహంకార హత్యలోనూ మరణించేది.

# రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలి

**తెలంగాణ రైతు పరిరక్షణ సమితి అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని డిమాండ్**



మేడ్చల్ మల్కాజిగిరి నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 13వ విడత అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన సంవత్సరం కానుకగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం సంక్రాంతి కానుకగా, అలాగే పురపాలక ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నిధులు విడుదల చేస్తామని పలుమార్లు ప్రకటించినప్పటికీ ఆ హామీలు అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడి సాయం సమయానికి అందకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని సాగు చేస్తున్నారని తెలిపారు. దీంతో రైతులు అప్పుల బారిన పడే ప్రమాదం ఉందని, వారి జీవన పరిస్థితులు సంక్షోభంలో పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీలోపు రైతు భరోసా నిధులను విడుదల చేయాలని, లేనిపక్షంలో ప్రజా సంఘాలు, రైతు సంఘాలతో కలిసి హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద భారీ స్థాయిలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దావత్ అరుణ్ కుమార్, అంబాల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హాఫీజ్‌పేట్ జనప్రియ సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవం.. పాల్గొన్న బాలింగ్ గౌతమ్ గౌడ్..



శేరిలింగంపల్లి నిర్భయవార్త జిల్లా ప్రతినిధి:. హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్మెంట్ శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయ 26వ వార్షికోత్సవ వేడుకలు ఆలయ నిర్వహణ కమిటీ చే సోమవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా హాఫీజ్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్ హాజరై ఆలయంలో సాయిబాబా కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్ గౌడ్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, లోకకళ్యాణం కోసం ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ గౌడ్, గురుప్రసాద్, రాముగౌడ్, బ్రహ్మానంద రెడ్డి, శ్రీనివాస్ , నాయుడు తదితరులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# రాములగుట్ట దేవాలయ నూతన చైర్మన్‌గా చిత్తయ్య గౌడ్ ఎంపిక కమిటీ సభ్యులకు ఘన సత్కారం



మూడుచింతలపల్లి నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లక్ష్మాపూర్ పరిధిలోని రాములగుట్ట ప్రాంగణంలో ఆదివారం రాములగుట్ట కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రస్తుత కమిటీ పదవీకాలం ముగియడంతో నూతన కమిటీని ఎన్నికల ద్వారా ఎన్నుకున్నారు. అధ్యక్ష పదవికి రూ.25 వేల డిపాజిట్ చెల్లించి ఆరుగురు అభ్యర్థులు పోటీపడగా, డ్రా పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. కౌన్సిలర్ భర్త చిన్నలచ్చ శ్రీనివాస్ చేత డ్రా తీయించగా, డ్రాలో చిత్తయ్య గౌడ్ పేరు రావడంతో ఆయనను రాములగుట్ట దేవాలయ కమిటీ నూతన అధ్యక్షునిగా ప్రకటించారు. అనంతరం మిగతా పదవులకు నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా మాడబోయిన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సింగం పవన్ కుమార్, కోశాధికారిగా లగిశెట్టి అరుణ్, సంయుక్త కార్యదర్శిగా తోట ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణ బాధ్యతలను తమ్మలి నాగరాజు పంతులు చేపట్టారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు, యువకులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సింగం సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ పారుపల్లి నాగరాజు, మాజీ ఉపసర్పంచులు కటికెల వైద్యనాథ్, మాడబోయిన రామకృష్ణ, పెద్దలు సింగం జైహింద్, బండి జగన్నాథం, క్యాతం మధుక్రిష్ణ, కిసరి నర్సిములు, కటికెల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. యువ నాయకులు బండి రవీందర్, శంకర్, బాలేష్, గోపి, సాయిశ్రీనివాసచారి, శ్రీశైలం, కరుణాకర్, వంశీ, రాకేష్ తదితరులు హాజరయ్యారు.

# ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు

**నివాళులర్పించిన అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి**



మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాద రావు జయంతి సందర్భంగా జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ, శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా సేవలందించిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని కొనియాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని తెలిపారు. ప్రజాసేవలో ఆయన చూపిన నిబద్ధత, విలువలు ప్రస్తుత తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ (ఇన్‌ఛార్జి) చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అలుపెరగని సేవల స్ఫూర్తి ప్రధాత డి ఎస్ ఆర్ కె ప్రసాద్..







మియాపూర్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: గత 20 సంవత్సరాలుగా శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిదిలో ప్రజలకు విశిష్ట సేవలను అందిస్తూ, రాజకీయ పార్టీలకు, కుల మతాలకు అతీతంగా అనేక సేవాకార్యక్రమాలు చేపట్టి, ప్రజలతో ప్రతి రోజు మమేకమై ప్రజల అవసరాలు తీర్చడం ఆయనకు అలవాటుగా మార్చుకున్న వ్యక్తి డి ఎస్ ఆర్ కె ప్రసాద్ ప్రసాద్స్ ఫౌండేషన్ స్థాపించి, స్వైన్ ఫ్లూ మందులు దగ్గరనుంచి, కరోనా వాక్సినేషన్స్ వరకు, అర్హులయిన వారికి రేషన్ కార్డ్స్, పెన్షన్స్ ఇప్పించడం కరోనా సమయం లో ఉచిత మందుల పంపిణీ, నిత్యావసరాల పంపిణీ, పేద ప్రజలకు తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, వెట్ గ్రైండర్స్, దుప్పట్లు, వికలాంగులకు చేయూత, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో, కర్నూలు, విశాఖపట్నం వరద బాధితులకు నిత్యావసరాలు, విరాళాలు, దుప్పట్లు, పంపిణి వంటి ఎన్నో సేవలు అందించడం జరిగింది, యువ ఇంజనీర్ కి యాక్సిడెంట్ జరిగితె నిమ్స్ హాస్పిటల్ లో వారికి చికిత్స కోసం ధన సహాయం చేయడం జరిగింది. గవర్నమెంట్ స్కూల్స్ లొ పుస్తకాలు, ఎక్సమినేషన్ కిట్స్, ఉచిత వైద్య సేవలు అందించడం జరిగింది, ముఖ్యంగా పలు కాలనీలలో కార్పొరేట్ హాస్పిటల్స్ వారిని తీసుకొచ్చి ఇప్పటికి 15 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, పేద వారికి అండగా ఉంటూ, సమాజ సేవ చేస్తున్నారు, ప్రసాద్స్ ఫౌండేషన్ లో డి ఎస్ ఆర్ కె ప్రసాద్ తో పాటు లీలా ప్రసాద్ ఫౌండేషన్ డైరెక్టర్ గా, ప్రోగ్రాం చీఫ్ కో ఆర్డినేటర్ గా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. యువతకు క్రికెట్, షటిల్ బ్యాట్మింటన్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించడం జరిగింది, ముఖ్యం గా చేతన ఫౌండేషన్ వెనిగళ్ళ రవి కుమార్ సహకారంతో, వారి స్ఫూర్తి తో ప్రసాద్స్ ఫౌండేషన్ స్థాపించడం, పేదల పాలిట ఒక వరం గా భావిస్తున్నట్లు ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ తెలిపారు, అనాథ పిల్లలకు ఫ్రూట్స్, బ్రెడ్స్, నిత్యావసరాలు, గత 20 సంవత్సరాలలో అనేక సార్లు సహాయం చేయడం జరిగింది. అనాథలు ఫుట్ పాత్ మీద పడుకునే వారిని గుర్తించి వారికి ఆహారం అందించడం, వారికి దుప్పట్లు అందించడం జరిగింది. అలాగే సేవే లక్ష్యం సేవే ముఖ్యం అనే నినాదం తో ఎన్నో కార్యక్రమాలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వేల సంఖ్యలో మొక్కలు నాటారు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా, జోన్ చైర్మెన్ గా, అనేక బ్లడ్ డొనేషన్ క్యాంపులు, హెల్త్ క్యాంపులు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, కళ్ల అద్దాల పంపిణి, కంటి రెటీనాలు కలెక్ట్ చేయడం జరిగింది, ముఖ్యం గా ప్రసాద్స్ ఫౌండేషన్ సభ్యులు ఏ కార్యక్రమం తలపెట్టినా అందుబాటులో ఉండడం, తలపెట్టిన కార్యక్రమం కోసం అహర్నిశలు కృషి చేయడం చాలా సంతోషంగా ఉంది అని ప్రసాద్స్ ఫౌండేషన్ డైరెక్టర్ లీలా ప్రసాద్ తెలిపారు. అలాగే మా ప్రసాద్స్ ఫౌండేషన్ రీల్స్ కాదు రియల్ గా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రతి నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి వారికి అండగా వుండే ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ కి, మా సభ్యులు భాషా , రవి, వినోద్ చౌదరి, సురేందర్, రాంబాబు, మూర్తి , శేఖర్ నాయుడు, వెంకట్రావ్, ఎం ఆర్ కె చౌదరి, శ్రీను, శ్రీకాంత్, పెద్దబాబు, సుదులగుంట్ల ప్రసాద్, రాజేష్, తులసి, పవన్, బాలు, చిన్న, బొజ్జ రవికుమార్, సతీష్, సింహాచలం, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి , నరేశ్ నాని, అభిజిత్, రాము, యశ్వంత్, వరుణ్, మహేశ్ బాబు లకు ధన్యవాదాలు తెలుపుతూ రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని లీలా ప్రసాద్ తెలిపారు.

# కనుల విందుగా శ్రీశ్రీశ్రీ లక్ష్మీ పద్మావతి సహిత వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**పట్టు వస్త్రాలు సమర్పించిన మాజీ ఆలయ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య**
**వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు పొందిన కారేపల్లి పాలకవర్గం**
**మునుపటికంటే కనుల విందుగా కళ్యాణ మహోత్సవం నిర్వహించిన ఆలయ కమిటీ**
**ఆలయ అభివృద్ధికి దాతలుగా నిలవండి.. కార్యనిర్వాన అధికారి వేణుగోపాల చారి**



సింగరేణి మార్చి 2 నిర్భయవార్త రిపోర్టర్. శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం కారేపల్లి గ్రామం సింగరేణి మండలం ఖమ్మం జిల్లా శ్రీశ్రీశ్రీ లక్ష్మీ పద్మావతి సహిత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం కనులవిందగా ఆలయ కమిటీ నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 2.3.2026న సోమవారం 5:30 నుంచి స్వామివారి సుప్రభాతమేమ పంచాంగములతో అభిషేక స్వామి వారి అలంకరణ ఏడు పది నిమిషాల నుండి స్వామివారి సర్వదర్శనం తీర్థప్రసాద వినియోగం 2.3.26 సోమవారం ఉదయం 9:45 నిమిషాలకు కలియుగ గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం మహోత్సవం ప్రారంభమై కనుల పండువగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ మహోత్సవానికి పట్టు వస్త్రాలు మాజీ ఆలయ చైర్మన్ అడ్డగోడ దంపతులు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేయడంలో సుమారు 1200 మందికిపైగా ఈ కార్యక్రమానికి హాజరై తీర్థప్రసాదాలు మహా అన్నదాన స్వీకరించారు. అనంతరం సాయంత్రం నాలుగున్నర నుండి స్వామివార్ల ఊరేగింపు గ్రామ పురవీధుల్లో నిర్వహించారు. ఈ దేవాదాయ కార్య నిర్వహణ అధికారి వేణుగోపాలచార్యులు,



మాజీ ఆలయ చైర్మన్ ఐలయ్య, గ్రామ సర్పంచ్ టోనీ, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది మూడు మోహన్, పగడాల మోహన్ కృష్ణ గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులపై సత్వర పరిష్కారం: అదనపు కలెక్టరు ఆదేశాలు







మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును జాప్యం లేకుండా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం అధికారుల ప్రధాన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను అదనపు కలెక్టరు, డీఆర్ఓ (ఇన్‌ఛార్జి) చంద్రావతి కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ హౌజింగ్ విభాగానికి అధిక సంఖ్యలో దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో వ్యయప్రయాసలు చేసి కార్యాలయానికి వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరస్కరించాల్సిన దరఖాస్తుల విషయంలోనూ పారదర్శకత పాటించాలని, తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. అలాగే స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో తక్షణం నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మాదిగ యువకునిపై దాడి నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఆధ్వర్యంలో ధర్నా దాడికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలి



నిర్భయవార్త ప్రతినిధి :జగిత్యాల ప్రతినిధి, మార్చి 02 : ఎమ్మార్పీఎస్, వ్యవస్థాపక అధ్యక్షులు “పద్మశ్రీ” మందకృష్ణ మాదిగ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ యువకునిపై దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తహసిల్ చౌరస్తా వద్ద ధర్నా, నిరసన, కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎస్పీ, జిల్లా అధ్యక్షులు దుమాల గంగారం మాట్లాడుతూ లంబడి పెల్లి గ్రామానికి చెందిన ఎలగందుల అనిల్ మాదిగ, యాదవ కులానికి చెందిన అమ్మాయి కులహాంతర వివాహం చేసుకున్నారు. వారు ఇరువురు నంద్యాల పోలీస్ స్టేషన్ కు వచ్చి వారు రక్షణ కోరారు. ఇట్టి విషయంలో మల్యాల ఎస్ఐ అబ్బాయికి అమ్మాయికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ మేజరు అందులో అమ్మాయి ప్రెగ్నెంట్ అమ్మాయిని సఖి సెంటర్ కు పంపించడం జరిగింది. రెండు రోజుల క్రితం “సఖి” సెంటర్ వద్ద మల్యాల మండలం లంబాడి పల్లి గ్రామం చెందిన ఎలగందుల అనిల్ అనే యువకుని పై దాడి చేసి చంపడానికి ప్రయత్నించారని గంగారం ఆరోపించారు. అట్టి దాడికి నిరసనగా సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, జగిత్యాల జిల్లాలోని మల్యాల మండలంలోని లంబడి పల్లి గ్రామానికి చెందిన ఏనుగందుల అనిల్ అనే మాదిగ యువకునిపై కరీంనగర్ జిల్లా యాదవ.కుల చెందిన బిసి అమ్మాయి.తండ్రి బంధువులు కలిసి మూకుమ్మడిగా అనిల్ ను కత్తులతో బండరాళ్లతో దాడి చేశారని ఎమ్మార్పీఎస్, జగిత్యాల జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని గంగారం తీవ్రంగా మండిపడ్డారు. సఖి సెంటర్ వద్ద గత రెండు రోజుల నుండి అమ్మాయి నాన్న, కుటుంబ సభ్యులతో పాటు వారి బంధువులు గత రెండు రోజుల నుండి రెక్కీ నిర్వహిస్తున్నట్లు సఖి సెంటర్ సిబ్బంది మల్యాల ఎస్ఐకి సమాచారం ఇచ్చినట్టుగా మేము విచారణ కోసం వెళ్లగా సిబ్బంది మాకు తెలియజేశారు. ఇట్టి విషయంలో మల్యాల ఎస్ఐ కుల వివక్ష తో ప్రదర్శించినట్టుగా మాకు అర్థమైతే ఉందని గంగారం అన్నారు. ఎస్ఐపై పూర్తి విచారణ జరిపి ఎస్సైని సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ తరఫున తరఫున డిమాండ్ చేశారు. ఇట్టి విషయంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ విషయం తెలుసుకోవడం కోసం జగిత్యాలకు రావడం జరుగుతుందని గంగారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి. బెజ్జంకి సతీష్ మాదిగ, ఎంఎస్పి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ, జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు భువనగిరి కిషన్ మాదిగ, నేషనల్ వుమెన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో నక్క గంగారం, సీనియర్ నాయకులు దుమాల గంగాధర్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు బోల్లె అనిల్ మాదిగ, జగిత్యాల నియోజక వర్గం ఇన్చార్జి, బొల్లారం దివాకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కార్యదర్శి, సంగేపు ముత్తు, నియోజకవర్గ కో ఇన్చార్జి పోడేటి సునీల్ మాదిగ, మల్యాల మండల అధ్యక్షులు ముప్పారపు రామస్వామి మాదిగ, అంబేద్కర్ సంగం కార్యదర్శి గజ్జల రాజు మాదిగ, మండల ఉపాధ్యక్షులు విజయ్, బదనపల్లి సురేష్, ముప్పారపు అశోక్, రాము, తదితరులు పాల్గొన్నారు.

## శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు : జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం నిర్భయవార్త ప్రతినిధి : మార్చి 2 : శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు.దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా సోమవారం ఐడీఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా కార్యక్రమం నిర్వహిం చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని అన్నారు.దు ద్దిళ్ల శ్రీపాదరావు 02 మార్చి 1935న జయశంకర్ భూపాలపల్లి జిల్లా ధన్వాడ గ్రామంలో జన్మించారు. స్వగ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తిచేసి, మంథనిలో ఉన్నత విద్యను అభ్యసించారు. అనంతరం హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్, బి.ఎస్‌సి., ఆర్ట్స్ మరియు లా విద్యలను అభ్యసించారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు.తె లంగాణ ప్రాంతానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడైన ఆయన ధన్వాడ గ్రామ సర్పంచ్‌గా పలు మార్లు సేవలందించారు. 1980లలో మరియు 1990ల ప్రారంభంలో మంథని నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని పొందారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించి విశిష్ట సేవలందించారు.స్పీకర్ గా ఆయన నిష్పాక్షికత, క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విలువల పట్ల అంకితభావంతో సభా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా గౌరవం పొందిన నాయకుడిగా గుర్తింపు పొందారు. సభ గౌరవాన్ని కాపాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు.గ్రా మాభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం, ప్రజల సమస్య ల పరిష్కారం లో ఆయన కృషి విశేషమైన దని, సరళత, సమగ్రత, నిబద్ధత ఆయన వ్యక్తిత్వ లక్షణాలు గా నిలిచాయ ని కలెక్టర్ తెలిపారు .1999 ఏప్రిల్ 13న కరీంనగర్ జిల్లా అన్నారం గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఆయన దుర్మరణం చెందారు.

## కారేపల్లి గ్రామపంచాయతీలో ఘనంగా పాలకవర్గం హోలీ సంబరం

### హోలీ శుభాకాంక్షలు తెలిపిన గ్రామ సర్పంచ్ టోనీ






సింగరేణి మార్చి 2 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం ఘనంగా హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ టోనీ, పాలకవర్గం హోలీ సంబరాల్లో మునిగింది. ఒకరికొకరు ప్రేమానురాగాలతో హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ టోనీ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా కలిసి రంగులు పోసుకుంటూ ప్రతి ఒక్కరు హోలీ వేడుకల్లో పాల్గొనాలని గ్రామ ప్రజలందరికీ పాలకవర్గం తరపున హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఖమ్మం జిల్లా ఉత్తమ సెక్రటరీగా అవార్డు అందుకున్న నెహ్రూకి పాలకవర్గం సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టోనీ, కార్యదర్శి నెహ్రూ, ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు అంజయ్య, యాకుబ్ ఆలీ, కుమార్, రాధా, భూమిక, సుష్మ, లింగమ్మ, సరోజ, సర్దార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో ప్రజావాణి కి కొన్ని శాఖలే హాజరు

### మిగతా శాఖలు హాజరు కాకపోవడంతో ప్రజల అసంతృప్తి ప్రజావాణికి క్రింది స్థాయి అధికారులే హాజరు





సింగరేణి మార్చి 2 నిర్భయవార్త రిపోర్టర్. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ప్రజావాణి ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమం సింగరేణి మండల కేంద్రంలో కొన్ని శాఖలే హాజరయ్యాయి. ఈ ప్రజావాణికి క్రింది స్థాయి అధికారులే హాజరయ్యారు. ప్రజావాణికి సింగరేణి మండల పరిధిలోనే 41 గ్రామపంచాయతీలో గల ప్రజలు వారి సమస్యలను ప్రజావాణిలో అధికారులకు తెలుపుటకు రాగా క్రింది స్థాయి అధికారులే హాజరు కావడంతో ఏ అధికారికి వారి విన్నపం వినిపించుకోవాలో తెలియని స్థితిలో ఉన్నారు. వచ్చిన కింది స్థాయి అధికారులు కూడా వారి ఫోన్లో బిజీగా ఉండడంతో అర్థం స్థితి ఉందని ప్రజలు వాపోయారు. ఈ ప్రజావాణి కి 25 శాఖల హాజరు కావాల్సి ఉండగా 15 శాఖలే హాజరు కావడం పట్ల ప్రజలు త్రీవ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సింగరేణి మండల కేంద్రంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలు హాజరయ్యే విధంగా చూడాలని పలువురు కలెక్టర్ను కోరారు.

## ప్రమాదకరంగా విద్యుత్ సప్లై వైర్లు

### చెట్టు కొమ్మలు తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యం? ప్రమాదం సంభవిస్తే తప్ప అధికారులకు స్పందన కరువు.



సింగరేణి మార్చి 2 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి (కారేపల్లి) మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్ లో ఫారెస్ట్ కార్యాలయపు సమీపంలో ఒక భారీ వృక్షం గ్రామానికి సప్లై అయ్యే విద్యుత్ వైర్లకు పూర్తిస్థాయి వాడడంతో విద్యుత్ సప్లై లో ఆటంకం ఎదురవుతుంది. చెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లకు తగిలినప్పుడు మంటలు రావడం జరుగుతుంది. కాలినడకన, వాహనాలపై ఆ ప్రాంతం గుండా నడిచే ప్రజలకు మంటలు రావడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప అధికారుల స్పందన కరువైందని మండలంలో చర్చ మొదలైంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చెట్టుకొమ్మలు తొలగించి రక్షణ కల్పించాలని కోరారు. ఎండాకాలం మొదలు కావడంతో గాలులు బలంగా వీల్చే అవకాశం ఉ ఒదని విద్యుత్ సప్లై కి ఆటంకం కలగకుండా చెట్టుకొమ్మలు తొలగించి ప్రమాద సంఘటన నుంచి కాపాడని పలువురు కోరారు.

# స్వగ్రామానికి చేరుకున్న టాలీవుడ్ సినీ నటుడు విజయ్ దేవరకొండ దంపతులు

## ఘనంగా స్వాగతం పలికిన గ్రామస్తులు



నిర్భయవార్త ప్రతినిధి : అచ్చంపేట (మార్చి 2): టాలీవుడ్ సినీ నటుడు విజయ్ దేవరకొండ ఈ మధ్యన సినీనటి రష్మిక ను వివాహం చేసుకున్న నేపథ్యంలో సోమవారం స్వగ్రామమైన నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలం తుమ్మన్ పేట గ్రామానికి ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. ఈ



సందర్భంగా నూతన దంపతులైన విజయ్ దేవరకొండ, రస్మికకు కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు మంగళ వాయిద్యాలతో, వేద పండితుల మంత్రోచ్ఛరణతో, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తన వ్యవసాయ పొలంలో ఉన్న ఫామ్ హౌస్ గృహప్రవేశం, తులసి పూజ, సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా టాలీవుడ్ సినీ నటులు వస్తున్నారన్న విషయం తెలిసిన అభిమానులు, కుటుంబ సభ్యులు,భారీ ఎత్తున గ్రామానికి చేరుకోవడంతో గ్రామంలో సందడి నెలకు ఉంది. ఈ కార్యక్రమానికి అచ్చంపేట నియోజకవర్గంలో ఉన్న వివిధ పార్టీల ముఖ్య నాయకులు గ్రామానికి చెందిన దాదాపు 400 మంది హాజరయ్యారు. విజయ్ దేవరకొండ-రష్మిక పెళ్లి సందడి సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున సందడి వాతావరణం నెలకొంది ఆంక్షలు విధిస్తూ ముందస్తు పాసులు అనుమతి ఉన్న వారికి మాత్రమే అనుమతించారు. ప్రైవేట్ సెక్యూరిటీ సైన్యం మండపంలోకి అనుమతి ఇస్తున్నారు. భద్రత ఏర్పాట్లను నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్, సిఐ నాగరాజు, బల్మూర్ ఎస్సై రాజేందర్, పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# సైబర్ నేర బాధితులకు ఊరట - ఉచిత ప్రభుత్వ న్యాయ సహాయం అందజేత

## కోల్పోయిన సొమ్మును తిరిగి పొందేందుకు 'లీగల్ ఎయిడ్' సేవలను అందుబాటులోకి. జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర ఐపీఎస్ వెల్లడించారు.




నిర్భయవార్త ప్రతినిధి :కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 2: కామారెడ్డి జిల్లా పరిధిలో సైబర్ నేరాల బారిన పడి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం మరియు జిల్లా న్యాయ విభాగం సంయుక్తంగా కీలక చర్యలు చేపట్టాయి. కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్రీ యం.రాజేష్ చంద్ర ఐపిఎస్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. సి హెచ్. వి ఆర్ ఆర్ వరప్రసాద్ , సైబర్ క్రైమ్ బాధితులకు ఉచిత ప్రభుత్వ న్యాయ సహాయం (లీగల్ ఎయిడ్) అందించాలనినిర్ణయించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బు కోల్పోయిన బాధితులు, ఆ నగదును తిరిగి పొందేందుకు (రిటర్న్ అఫ్ ప్రాపర్టీ) ప్రక్రియలో భాగంగా సంబంధిత కోర్టులో పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అయితే, ఆర్థికంగా వెనుకబడిన వారు లేదా ప్రైవేట్ న్యాయవాదులను సంప్రదించే స్తోమత లేని బాధితుల కోసం ప్రభుత్వం తరఫున ఉచితంగా 'లీగల్ ఎయిడ్ అడ్వకేట్' సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. బాధితులు ఎటువంటి ఖర్చు లేకుండా ప్రభుత్వ న్యాయవాది ద్వారా కోర్టులో పిటిషన్ దాఖలు చేసి, తమ సొమ్మును తిరిగి పొందే చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయవచ్చు.కావున, సైబర్ నేరాల వల్ల నగదు నష్టపోయి, ఆ మొత్తం బ్యాంక్ ఖాతాలలో ఫ్రీజ్ (ఫ్రీజీ) అయి ఉన్న బాధితులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ఈ ప్రక్రియపై మరిన్ని వివరాల కోసం బాధితులు టోల్ ఫ్రీ నంబర్:15100 లేదా తమ సమీప పోలీస్ స్టేషన్ను లేదా జిల్లా సైబర్ క్రైమ్ సెల్ను సంప్రదించవలసిందిగా కోరుచున్నాము. పి ఆర్ ఓ (పోలీస్ శాఖ -- కామారెడ్డి)

# ఆపండి.!బాల్య వివాహాల్ని...

## 18 సం॥లలోపు బాలికలకు వివాహము చేయడం చట్టరీత్యానేరం
## బాల్యవివాహాల విషయంలో బాధ్యతగా ముందుకెళదాం
## స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బాల్యవివాహ విముక్తి భారత రథయాత్ర
## నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి



నిర్భయవార్త ప్రతినిధి : నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (మార్చి 2): బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టడానికి సమాజంలోని ప్రతి వ్యక్తి బాధ్యత వహించాలని నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, పిలుపునిచ్చారు. కోనేరు స్వచ్ఛంద సేవా సంస్థ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థల ఆధ్వర్యంలో, లైన్ డిపార్ట్మెంట్ల సహకారంతో బాల్య వివాహ విముక్తి ప్రచార రథయాత్ర సోమవారం నాగర్ కర్నూల్ జిల్లాలోని బల్మూర్ మండలం తుమ్మ న్పేట్ గ్రామంలో ప్రారంభమైంది. పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ఈ రథయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ.. "జిల్లాలో ఇప్పటికీ బాల్యవివాహాలు జరుగుతున్నాయి. వీటిని నిర్మూలించడానికి అవగాహన కల్పించడం చాలా అవసరం. స్వచ్ఛంద సంస్థలు ఈ దిశగా చేస్తున్న ప్రయత్నాలు అభినం దనీయం. వంద రోజుల బాల్యవివాహ విముక్త క్యాంపెయిన్కు అందరూ సహకరించాలి" అని అన్నారు. "బాల్యవివాహాలు బాలల భవిష్యత్తును దెబ్బతీస్తాయి. విద్య, ఆరోగ్యం, స్వావలంబనపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఈ రథయాత్ర ద్వారా గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తాం. తల్లిదండ్రులు, యువత ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ప్రభుత్వం, సంస్థలు కలిసి కృషి చేస్తే బాల్యవివాహాలను పూర్తిగా అంతం చేయవచ్చు" అని తెలిపారు. కోనేరు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు మాట్లాడుతూ "మా సంస్థ ద్వారా జరుగుతున్న ఈ ప్రచారం బాలల హక్కులను కాపాడుకోవడంలో ముఖ్యమైన అడుగు. రథయాత్రలో పాల్గొన్న ప్రజలు, అధికారుల సహకారంతో జిల్లాలో బాల్యవివాహాల సంఖ్య తగ్గుతుందని ఆశిస్తున్నాం. ప్రతి బాలుడు/బాలిక విద్యను అభ్యసించి, స్వయం సమృద్ధి పొందాలి. ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు మావిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి. కోనేరు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు. ఏరియా కోఆర్డినేటర్లు జాకీర్ హుస్సేన్ శ్రీనివాస్ యాదవ్. మోబిలైజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు

## -శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





నిర్భయవార్త ప్రతినిధి :కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 2: దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా జిల్లా యువజన ఉ క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ, శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని పేర్కొన్నారు. దుద్దిళ్ల శ్రీపాద రావు02 మార్చి 1935న జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ధన్వాడ గ్రామంలో జన్మించారు. స్వగ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తిచేసి, మంథనిలో ఉన్నత విద్యను అభ్యసించారు. అనంతరం హైదరాబాద్ లో ఇంటర్మీడియట్, బి.ఎస్సి., ఆర్ట్స్ , లా విద్యలను అభ్యసించారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడైన ఆయన, ధన్వాడ గ్రామ సర్పంచ్గా పలు మార్లు సేవలందించారు. 1980లు మరియు 1990ల ప్రారంభంలో మంథని నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని పొందారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్గా బాధ్యతలు స్వీకరించి విశిష్ట సేవలందించారు. స్పీకర్ గా ఆయన నిష్పాక్షికత, క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విలువల పట్ల అంకితభావంతో సభా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా గౌరవం పొందిన నాయకుడిగా గుర్తింపు పొందారు. సభ గౌరవాన్ని కాపాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. గ్రామాభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన కృషి విశేషమైనదని సరళత, సమగ్రత, నిబద్ధత ఆయన వ్యక్తిత్వ లక్షణాలుగా నిలిచాయన్నారు. 1999 ఏప్రిల్ 13 న కరీంనగర్ జిల్లా అన్నారం గ్రామ సమీపంలో దుర్మరణం చెందారని, ఆయన సేవలు, ప్రజాస్వామ్య పరిరక్షణలో చూపిన అంకితభావం, ప్రజా సేవ పట్ల నిబద్ధత భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, ఆర్డీఓ వీణ, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ చందర్, జిల్లా అధికారులు, టీజీవో, టీఎన్జీఓల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పనితీరు మెరుగుపడాలి ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రామారావు




ఖమ్మం, మార్చి 02 నిర్భయవార్త ప్రతినిధి : జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి ప్రతి నెల నిర్వహించే మీటింగ్ లో భాగంగా సోమవారం ప్రేరణ సమావేశ మందిరంలో ఏర్పాటు చేయగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి.రామారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ హాస్పటల్స్ వాళ్ళు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న విధంగా ప్రభుత్వ పి.హెచ్.సి.లను, హాస్పటల్స్ ను కూడా తప్పక రిజిస్ట్రేషన్ చేయించాలని, జిల్లాలో ప్రభుత్వ హాస్పటల్లలో 'సి' సెక్షన్ (సిజేరియన్)లు ఎక్కువగా జరుగుతున్నాయి కాబట్టి, ఎందుకోసం 'సి ' సెక్షన్ (సిజేరియన్ ) ఆపరేషన్లు జరుగుతున్నాయో ప్రతి కేసును క్షుణ్ణంగా ఆడిట్ చేయాలనీ, నార్మల్ డెలివరీస్ ను ప్రోత్సహించాలని, ఈ నెల 4వ నుండి మన జిల్లాలో హెచ్.పి.వి. ( హ్యూమన్ పాపిలోమా వైరస్ )వ్యాక్సిన్ (14 సంవత్సరాల వయసు కల్గిన బాలికలలో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు)ను ప్రారంభం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని, ఇందుకుగాను ప్రభుత్వం , వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని, జిల్లాలో విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు కాబట్టి, విద్యార్థులు పరీక్షలకు భయపడ్డా, ఒత్తిడికి లోనైనా, నిద్రలేమి, నిరాశ, మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు తలితండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి ప్రభుత్వం, కమీషనర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 'టెలీ మానస్ 14416' టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి డాక్టర్లు, నిపుణులచే పరిష్కారం ' పొందగలరని, జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ టార్గెట్ లక్ష్యాలను చేరుకోలేకపోతే, మన జిల్లా వల్ల రాష్ట్ర లక్ష్యాల శాతం కూడా తగ్గే అవకాశం వుంది కాబట్టి ప్రతి పి.హెచ్.సి.కి కేటాయించిన లక్ష్యాలను తప్పక పూర్తిచేయాలనీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తెలిపారు. చివరగా హెల్త్ సూపర్వైజర్ లంక కొండయ్య ప్లాస్టిక్ వస్తువులను నిషేదించాలని, చేతి సంచులను వాడాలానే ఉద్దేశ్యంతో తాను తీసుకు వచ్చిన 'చేతి సంచులను' డీఎంహెచ్ఓ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎండాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి.చందు నాయక్ తెలిపారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.అరుణా దేవి, డెమో వి. సుబ్రహ్మణ్యం, ఎస్.ఓ. నవీన్ కుమార్, హెల్త్ ఎడుకేటర్ అన్వర్, ప్రగతి, పి.హెచ్.సి.ల నుండి విచ్చేసిన సి.హెచ్.ఓ.లు, హెచ్.ఈ.ఓ.లు,పి.హెచ్.ఎన్.లు, హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# కళాకారుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్లో 1000 కోట్ల నిధులు కేటాయించాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఏం బాల నరసింహా డిమాండ్



నిర్భయవార్త ప్రతినిధి : నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (మార్చి 2): సమగ్ర సాంస్కృతిక విధానం రూపొందించాలి కళా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ ముందు జరిగిన ధర్నా కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఏం బాల నరసింహ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమంలో కళాకారు లది ముఖ్య పాత్ర అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ తర్వాత కళాకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని గతప్రభుత్వం హామీ ఇచ్చి నెరవేర్చలేకపోయిందని, ఈ ప్రభుత్వం కూడా కళాకారులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిఆదుకుంటామని చెప్పి రెండుసంవత్సరాలు అయినా నేటికీ మాట నిలబెట్టుకోలేక పోతుందని, ఈసారి రాష్ట్ర బడ్జెట్లో కళాకారులకు 1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన కళాకారులకు నెలకు 5000 పెన్షన్ ఇవ్వాలని 50 సంవత్సరాల నిండిన మహిళా కళాకారులకు పెన్షన్ ఇవ్వాలనిఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల ఇవ్వాలని సాంస్కృతిక కోటాలో వారికి ఉద్యోగాలు , ఉచిత బస్పాసులు , రైలులో 50% రాయితితో కూడిన రవాణా సౌకర్యం , గుర్తింపు కార్డులు , ఆరోగ్య కార్డులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు తన్నీరు మల్లయ్య , కార్యదర్శి పెబ్బేటి విజయుడు కళాకారులు పర్వతాలు , సలేశ్వరం, చందు, యాదగిరి ,ఉషన్న గౌడ్ కందూరికేశవులు , పటేల్ రాముడు , నాగరాజు చిన రాముడు బాలస్వామి జ్యోతి , మనిషా , వెంకటస్వామి సువర్ణ కల్పన పద్మ సంపూర్ణ నరసింహా జిల్లా ఉపాధ్యక్షులు కేసముల శివకృష్ణతదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పాఠశాలలోని విద్యార్థుల దాహం తీర్చిన

## -1995 లో చదివిన 5 వ తరగతి పూర్వ విద్యార్థులు
## -పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ అందజేత
## -ప్రారంభించిన మండల ఎస్సై దామోదర్

నిర్భయవార్త ప్రతినిధి : గజ్వేల్ డివిజన్ ప్రతినిధి మార్చ్ 02, సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు 1995 లో 5 వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల దాహం తీర్చేందుకు 1995 పూర్వ విద్యార్థులు పి.ఆంజనే యులు,కె.జగన్,ఈ.బాల్ నర్సయ్య,ఎన్ .వెంకటేష్,కె.లా లయ్య,కె.కృష్ణ,బి. బ్రహ్మచారి లు తమ సొంత డబ్బులతో వాటర్ ప్యూరిఫైర్ ని అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మర్కుక్ మండల ఎస్సై దామోదర్,పూర్వ ఉపాధ్యాయులు రాజిరెడ్డి హాజరయ్యి వాటర్ ప్యూరిఫైర్ ని స్థానిక సర్పంచ్ ర్యాకం యాదగిరి,పూర్వ విద్యార్థులతో కలసి ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ ముందుగా విద్యార్థుల దాహం తీర్చడానికి ముందుకు వచ్చిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని,అలాగే శుద్ధి చేసిన నీటిని తాగితే,మెదడు చురుకుగా పనిచేస్తుందని,పదవ తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.స్థానిక సర్పంచ్ ర్యాకం యాదగిరి మాట్లాడుతూ విద్యార్థులకు వాటర్ ప్యూరిఫైర్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు.తమ వంతుగా పాఠశాలలోని విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు.పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గ్రామ ప్రజలు చాలా మంది గ్రామంలోని పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారని,ప్రవేట్ పాఠశాలలో బోధన చెప్పే ఉపాధ్యాయులు చాలా వరకు ఇంటర్,డిగ్రీ చదివిన వారు మాత్రమే బోధిస్తున్నారని,ప్రభుత్వ పాఠశాలలో అలా కాదని ప్రతి ఒక్క ఉపాధ్యాయులు పోటి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగం సాధించి,ఎన్నో సంవత్సరాల నుండి ఎంతో అనుభవం కల్గిన ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు.ప్రైవేటు పాఠశాలల్లో వేలకు వేలు పిల్లలకు కట్టే ఫీజులలో ఎంతో కొంత గ్రామంలోని పాఠశాలకు సహాయపడితే ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని,అలాగే విద్యార్థులు కూడా బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు,గ్రామానికి మంచి గుర్తింపు తీసుకొస్తారని అన్నారు.మాలాగే ప్రతి పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కి కృషి చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్,వార్డు సభ్యులు లావణ్య ఆంజనేయులు,శ్యామ్ సుందర్,కనకయ్య,శేఖర్,విజయ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ రెడ్డి,ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి,విశ్వేశ్వర్ రెడ్డి,వెంకట్,రాజయ్య,కృష్ణ,గౌతమి తదితరులు ఉన్నారు.



# డైమండ్ లారీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

## -తోటి డ్రైవర్ మరణించడం చాలా బాధాకరం
## -లారీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు



నిర్భయవార్త ప్రతినిధి : గజ్వేల్ డివిజన్ ప్రతినిధి మార్చ్ 02, లారీ డ్రైవర్స్ యూనియన్ సభ్యుడు మహిపాల్ రెడ్డి చనిపోవడం చాలా బాధాకరమైన విషయమని డైమండ్ లారీ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.డైమండ్ లారీ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ ప్రజ్ఞాపూర్ ఆధ్వర్యంలో ఇటీవల మరణించిన సిద్దిపేట జిల్లా ములుగు గ్రామానికి చెందిన మహిపాల్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం రూ.69,500(అరవై తొమ్మిది వేల ఐదు వందలు)అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశామని,మైపాల్ రెడ్డి మరణం వారి కుటుంబానికి తీరని లోటు అని తెలిపారు.మనలో ఒకడు మన తోటి డ్రైవర్, మన లారీ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ సభ్యుడు మరణించడం చాలా బాధాకర విషయమని,మహిపాల్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో డైమండ్ లారీ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నరేష్, కోశాధికారి శ్రీనివాస్, గౌస్, శ్రీను, రవి, మధు, వెంకటేష్ గౌడ్, రమేష్, రవి, యాదగిరి, అన్వర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


# మహిళలందరికి పూర్తిస్తాయిలో అవగాహనా కలిగి ఉండాలి



నిర్భయవార్త ప్రతినిధి :మార్చి 02,మందమర్రి టౌన్ మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో జిఎం ఆఫీస్ లో పనిచేస్తున్న మహిళలందరికీ మదర్ తెరిసా ఎడ్యుకేషనల్ సోషల్ సర్వీస్ సొసైటీ వారి సహకారంతో సెక్సువల్ అరెస్మెంట్ ఆఫ్ ఉమెన్ యట్ వర్క్ ప్లేస్ ఆక్ట్ 2013 ప్రకారం పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, నివారణ, పరిష్కారాలకు సంబంధించిన పోష్ యాక్ట్ ఈ చట్ట ప్రకారం ప్రతి సంస్థలో మహిళలందరికీ పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని సోమవారం అంతర్గత ఫిర్యాదుల కమిటీ వారిచే పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జనరల్ మేనేజర్ మందమర్రి ఏరియా ఎన్ .రాధాకృష్ణ మహిళలకు ప్రశ్నాపత్రాలు అందజేసి పరీక్షలను ప్రారంభించినారు. జి ఎం రాధాకృష్ణ మాట్లాడుతూ 2013 ఆక్ట్ ప్రకారం పోష్ ఆక్ట్ కింద మహిళలకు లైంగికంగా పని స్థలాలలో ఎలాంటి ఇబ్బంది కలిగిన ఈ ఆక్ట్ ద్వారా అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయాలని అన్నారు.ఈ వ్రాత పరీక్షలలో ముగ్గురిని ఎంపిక చేసి వారికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ముఖ్య అతిధులచే ప్రశంస పత్రాలను అందజేస్తారని జిఎం తెలియజేశారు.ఈ కార్యక్రమంలో. డి జి ఎం పర్సనల్ అశోక్,మదర్ తెరిసా ఎన్. జి. ఓ. ప్రెసిడెంట్ కె .భువనేశ్వరి, అంతర్గత ఫిర్యాదుల కమిటీ సభ్యులు, , డివైఎఫ్ఎం, ఎఫ్ అండ్ ఏ సరిత, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీమతి నవనీత, సీనియర్ పిఓ రవళి, ఇన్విజిలేటర్స్ రూపలత, అనిత, రమణకుమారి (సింగరేణి హై స్కూల్) సత్యనారాయణ సీనియర్ పివో, మదర్ తెరిసా సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.


# ఇది బుల్డోజర్ల రాజ్యం

## పేదల ఇళ్లు కూల్చడం అమానుషం
## కాంగ్రెస్ పాలనపై ఎంపీ వద్దిరాజు మండిపాటు




ఖమ్మం, మార్చి 02 నిర్భయవార్త ప్రతినిధి : రాష్ట్రంలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని,పేదల ఇండ్లను కూల్చడవే పాలకులు ఒక పనిగా పెట్టుకున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యమంటూ పాలకులు ఊదరగొడుతున్నారని, వాస్తవానికిప్పుడు కొనసాగుతున్నది "బుల్డోజర్ల రాజ్యం"అని ఆయన దుయ్యబట్టారు.రామగుండంలో పేదల ఇండ్లను, మహబూబ్ నగర్ లో దివ్యాంగుల గూళ్లను,వెలుగుమట్లలో నిరుపేదల గుడిసెలను కూల్చారని,హైడ్రా పేరుతో పాలకులు విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు.ఎంపీ రవిచంద్ర హైదారాబాద్ తెలంగాణ భవన్ లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు జాడే కనిపించట్లేది ఆవేదన చెందారు.కాంగ్రెస్ నాయకులకు పాలించడం రాక"డైవర్షన్ పాలిటిక్స్" చేస్తున్నారని,మూసీ సుందరీకరణ,గాంధీ సరోవర్ పేరుతో అపార్టుమెంట్లు,పక్కా ఇండ్లను నేలమట్టం చేసే ప్రయత్నాలు జరుగుతుండడం శోచనీయమన్నారు.రాష్ట్రానికి వచ్చిన కాంగ్రెస్ అధినేత రాహూల్ గాంధీ ఇక్కడ నెలకొన్న గందరగోళ పరిస్థితులపై దృష్టి సారిస్తే బాగుంటుందని ఎంపీ రవిచంద్ర హితవు పలికారు.ఎన్నికలకు ముందు రాహూల్, ప్రియాంకా గాంధీలు వరంగల్, కామారెడ్డి తదితర డిక్లరేషన్లను ఆర్భాటంగా ప్రకటించి,432కుపైగా హామీలిచ్చారన్నారు. ఈ హామీల అమలు ఎంతవరకు వచ్చిందో, ఇస్తామన్న 2లక్షల ఉద్యోగాలలో ఇప్పటి వరకు భర్తీ జరిగిందెన్నో సమీక్షించాల్సిన బాధ్యత రాహూల్ గాంధీపై ఉందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లినప్పుడు "బుల్డోజర్ రాజ్య"అంటూ విమర్శించే రాహూల్ తాము పాలిస్తున్న తెలంగాణలో ప్రతినిత్యం బుల్డోజర్ల కింద పేదల బతుకులు చితికిపోవడం గురించి పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కొన్నేళ్లుగా జీవనం గడుపుతున్న పేదలపై పోలీస్ బలగాలతో విరుచుకుపడి గుడిసెలను నేలమట్టం చేయడంతో "ఇరాన్, గాజా"ల మాదిరి పరిస్థితి నెలకొన్నదని ఎంపీ వద్దిరాజు ఆందోళన వ్యక్తం చేశారు. నిల్వ నీడలేక, ఆకలితో అలమటిస్తున్న బాధితులను బీఆర్ఎస్ తరఫున ఆదుకుంటుంటే ఓర్వలేని పాలకులు పోలీసులతో కొట్టిస్తున్నారని, అంబేడ్కర్ భవనం నుంచి తరిమికొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వెలుగుమట్లలో నెలకొన్న పరిస్థితులు, బాధితుల హృదయవిదారక బతుకులను కళ్లారా చూసేందుకు ఖమ్మంలో పర్యటించాల్సిందిగా మీడియా ద్వారా రాహుల్ గాంధీని ఆయన కోరారు. బాధితులకు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీనిచ్చినట్లు తాము అధికారంలోకి వచ్చాక కట్టించి న్యాయం చేస్తామని ఎంపీ వద్దిరాజు చెప్పారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, గాంధీ నాయక్, బొమ్మెర రాంమూర్తి, డాక్టర్ కురవ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య




నిర్భయవార్త ప్రతినిధి :నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (మార్చి 2): నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని మొల చింతపల్లి గ్రామంలో చాకలి చిన్నయ్య కుమారుడు చాకలి సాయి (23) ఆదివారం రాత్రి వారి సొంత ఇంట్లో చీరతో ఉరి వేసుకునే ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం తన మిత్రులకు సాయి కనిపించకపోవడంతో ఇంటికి వెళ్లి కిటికీలోనుంచి చూశారు చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చారు. జనం తరలివచ్చి చూసి మృతుడి తల్లిదండ్రులు ఉపాధి కోసం గద్వాల జిల్లాకు వెళ్లారు. కుమారుడు తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఐటీడీఏ అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్. సురేష్ బాబు.**







నిర్భయవార్త ప్రతినిధి : నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (మార్చి 2):చెంచుల కోసం ఏర్పాటు చేస్తున్న వైద్య మరియు ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్. సురేష్ బాబు సోమవారం నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం నల్లమల అడవి ప్రాంతంలోని ఈర్లపెంట మరియు పుల్లయ్యపల్లి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. ఐటీడీఏ మరియు జిల్లా వైద్య మరి ఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించిన చెంచులు నివసించే అన్ని ఆవాసాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ శిబిరంలో అన్ని వయసుల వారు తప్పకుండా వచ్చి ఉంటారని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలనీ ఐ టి డి ఏ అదనపు డి ఎం హెచ్ ఓ డాక్టర్ ఆర్. సురేష్ బాబు తెలిపారు. సోమవారం రెండు ఆవాసాల శిబిరంలో 89 మందికి క్షయ వ్యాధి కొరకు స్క్రీనింగ్ పరీక్షల నిర్వహించి 3 క్షయ వ్యాధి నిర్ధారణ చేసినారు భవిష్య భారత్ మొబైల్ వాహనములో ఎక్స్రే- రే , రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ షుగర్ మరియు బిపి పరీక్షలు కూడా నిర్వహించడం జరిగింది సందర్భంగా డాక్టర్ ఆర్ సురేష్ బాబు మాట్లాడుతూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా వ్యాధులను సులభంగా తగ్గించవచ్చునని .ముఖ్యంగా గర్భవతులు పౌష్టికాహారం పై ప్రత్యేక శ్రద్ధ చూపి , ప్రతిరోజు ఆకుకూరలు తమ ఆహారంలో ఒక భాగంగా చేసుకోవడం ద్వారా గర్భవతులలో రక్తహీనతను అరికట్టడం ద్వారా సురక్షిత మాతృత్వం పొంది తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని తెలియజేశారు. ఈ శిబిరంలో ఐటీడీఏ డాక్టర్ కళ్యాణ్, అచ్చంపేట డివిజన్ ఉప మలేరియా అధికారి బికులాల్, హెల్త్ పీఎం జన్మన్ డాక్టర్ ప్రవీణ్,ల్యాబ్ టెక్నీషియన్, ఆకాష్ స్టాఫ్ నర్స్ రాణి,ఆరోగ్య కార్యకర్తలు, రాజేష్, పద్మ పాల్గొన్నారు.

# ప్రముఖ సినీ హీరో విజయకు దేవరకొండ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



నిర్భయవార్త ప్రతినిధి : నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (మార్చి 2): ప్రముఖ టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ నటి రస్మిక దంపతులు సోమవారం ఉదయం విజయ్ దేవరకొండ స్వగ్రామమైన నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం తుమ్మన్ పేట గ్రామానికి చేరుకుని వారి ఫామ్ హౌస్ లో నూతన గృహప్రవేశం చేసి సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన నటుడు విజయ్ దేవరకొండ దంపతులకు గ్రామస్తులు బంధువులు స్నేహితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రిసెప్షన్ నిర్వహించారు. దాదాపు పాసులు మంజూరు చేసిన 400 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరై హీరో విజయ్ దేవరకొండ హీరోయిన్ రష్మిక మందాన నూతన దంపతులకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలుపుతూ జ్ఞాపికను అందజేశారు.



# సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఫుడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన నిర్వహణ జరిగింది






నిర్భయవార్త ప్రతినిధి : కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 2: జిల్లా స్థాయి సలహా కమిటీ (డ్లక్) సమావేశంజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన జిల్లాలో ఆహార భద్రత విద్యాసంస్థలలో నాణ్యమైన భోజన సరఫరా అంశాల పై జిల్లా స్థాయి సలహా కమిటీ (డ్లక్) సమావేశం సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ)ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 కింద న్యాయనిర్ణేత అధికారిగా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన వివిధ కమిటీలకు అధిపతిగా వ్యవహరించి, జిల్లా స్థాయిలో ఆహార భద్రతా అధికారుల పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో ఆహార నాణ్యత మెరుగుదలకు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. జిల్లా వైద్యుడ ఆరోగ్య అధికారి (డి యం హెచ్ ఓ) ప్రభుత్వ నివాస విద్యాసంస్థలలో విద్యార్థుల ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించి, ప్రతి నెల ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలి.

అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మందుల నిల్వలు, వైద్య సదుపాయాలను సిద్ధంగా ఉంచాలి. కౌమారదశ బాలికలకు ఐరన్ అధికంగా ఉండే మాత్రలు అందించి రక్తహీనతను తగ్గించాలి. ఫుడ్ పాయిజనింగ్ ఘటనల సమయంలో ఆహార భద్రతా విభాగంతో సమన్వయం చేసుకోవాలి. జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం అందించబడుతున్నదీ క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ప్రతి పాఠశాలలో ఆహార భద్రతా కమిటీలు ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు వడ్డించే ముందు ఆహారాన్ని కమిటీ సభ్యులు రుచి చూసే విధానం అమలు చేయాలి. సురక్షిత తాగునీటి సరఫరా , ాా ప్లాంట్లు, నీటి ట్యాంకుల శుభ్రతను పర్యవేక్షించాలి. వంటగదుల్లో పరిశుభ్రత పాటిస్తూ వంటవారు చేతి తొడుగులు, టోపీలు ధరించేలా చూడాలి. పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని తయారు చేసి వడ్డించేలా చర్యలు తీసుకోవాలి. వంటచేసేవారికి , ఆహార నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. జిల్లా సంక్షేమఅధికారిగిరిజన విద్యార్థులు, పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలి. ఆరోగ్య శిబిరాల నిర్వహణలో వైద్య శాఖతో సమన్వయం చేసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పారిశుధ్యం పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. కౌమార బాలికల లో రక్తహీనత తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఫస్సై కింద ఉచితంగా నమోదు చేయించాలి. ఆహార నిర్వాహకులందరిలో అవగాహన పెంపొందించాలి. జిల్లా పంచాయతీ రాజ్ అధికారి గ్రామపంచాయతీ స్థాయిలోని అన్ని ఆహార వ్యాపార నిర్వాహకులను ఫస్సై కింద నమోదు చేయించాలని సూచించాలి. మండల స్థాయిలో లైసెన్స్ మేళాలు/రిజిస్ట్రేషన్ శిబిరాల సమయంలో ఆహార భద్రతా శాఖతో సమన్వయం చేసుకోవాలి. ఫుడ్ పాయిజనింగ్ ఘటనల సమయంలో తక్షణ సమన్వయం చేయాలి. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆహార వ్యాపార నిర్వాహకులు ఆహార భద్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా ఆహార భద్రత అధికారి శిరీష, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి రవీందర్, జిల్లా విద్యశాఖ అధికారి రాజు, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఫుడ్ సేఫ్టీ అధికారి విక్రమ్ , తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలి

**మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలు, విద్యాసంస్థలను తనిఖీలు నిర్వహించాలి.**
**హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి**
**పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి,**
**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్**



నిర్భయవార్త ప్రతినిధి :మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి మార్చి 2 మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో (స్థానిక సంస్థలు, రెవెన్యూ) అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.అనిల్ కుమార్, తో కలిసి కలెక్టర్ ప్రజావాణి నిర్వహించి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే సత్వరమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగాలకు సిఫారసు చేసి సమస్య పరిష్కారం చేయుటకు కృషి చేయాలని ఆదేశించారు,జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థలలో మండల ప్రత్యేక అధికారులు ప్రతి 15, రోజులు లేదా మాసంలో మూడు దఫాలుగా వారికి కేటాయించిన హాస్టల్లో తనిఖీ చేసి విద్యార్థులతో స్వయంగా మాట్లాడి అందుతున్న మౌలిక వసతులు విద్యా బోధనల గురించి వివరాలు అడిగి తెలుసుకొని తనకు నివేదిక సమర్పించాలని సూచించారు, ప్రతి విద్యా సంస్థలలో పిల్లలకు హెల్త్ ఎడ్యుకేషన్ న్యూట్రిషన్ సానిటేషన్ లపై ఎలాంటి జాప్యం లేకుండా సౌకర్యాలు కల్పించాలని, షెడ్యూలు ప్రకారం విద్యార్థిని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మానసిక ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉండాలని తెలిపారు, పదవ తరగతి పరీక్షలు వస్తున్న నేపథ్యంలో టైం టేబుల్ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహించి జిల్లాలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని, పరీక్షా కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు ఉండే విధంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు,మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను తనిఖీ చేస్తూ అమలుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ దశల్లో ప్రత్యేక చొరవ తీసుకొని లబ్ధిదారులకు తక్షణ సేవలను అందించాలన్నారు,



ప్రజావాణి కార్యక్రమంలో ఈరోజు వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ క్రింది విధంగా లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు, గార్ల మండలం బాలాజీ తండ పంచాయతీ కి చెందిన భూక్య శాంతి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినదని సాంకేతిక కారణాలతో బిల్లు మంజూరు కావట్లేదని తన సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. మరిపెడ మండలానికి చెందిన గోలి మృత్యుంజయ తన ఇంటికి సమబంధించి పన్ను గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం చాలా ఎక్కువగా వచ్చిందని సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని అన్నారు. మహబూబాబాద్ మండలం డి.ఎస్.ఆర్ జండాల తండ గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ గ్రామ పరిధిలో 5 తండాలు ఉన్నాయని అట్టి తండాలకు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మాణం చేయాలని కోరారు. మరిపెడ మండలం తానంచర్ల గ్రామానికి చెందిన పి.సునీత ఇందిరమ్మ ఇండ్ల రెండవ దశ నిర్మాణం బిల్లు మంజూరు చేయవలసిందిగా కోరి ఉన్నారు. బయ్యారం మండలం గౌరారం గ్రామానికి చెందిన వెంకటాద్రి తాను దీర్ఘకాలిక వ్యాది పక్షవాతం తో భాదపడుతున్నానని బతుకుదెరువుకు ఆధారం ఏమి లేదని వికలాంగుల పెన్షన్ ఇప్పించి ఆదుకోవాలని అన్నారు, బయ్యారం మండల కేంద్రాన్ని నియోజకవర్గంగా మార్చుటకు సిఫారసు చేయాలని,నియోజకవర్గ సాధన కమిటీ సభ్యులు దరఖాస్తు చేశారు, ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి లో (107 ) దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మహబూబాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారి క్రిష్ణవేణి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జెడ్పి సీఈవో పురుషోత్తం, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డిపిఓ హరిప్రసాద్, ఎక్సైజ్ ఎస్పి కిరణ్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి మరియన్న, ఎస్సీ, బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్,అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరా నిఘాలో నర్సన్నపేట గ్రామం

**-మండల ఎస్సై ఓ.దామోదర్**
**-మండల మాజీ జెడ్పిటిసి మంగమ్మ రామచంద్రం**



నిర్భయవార్త ప్రతినిధి : గజ్వేల్ డివిజన్ ప్రతినిధి మార్చ్ 02, సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని నర్సన్నపేట గ్రామంలో సీసీ కెమెరాలను రామాంజనేయ రైస్ మిల్ బాల్ నారాయణ తన సొంత ఖర్చులతో గ్రామానికి అందజేశారు. సోమవారం నాడు మర్కుక్ మండల ఎస్సై దామోదర్,మండల మాజీ జెడ్పిటిసి మంగమ్మ రామచంద్రం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ బాల నర్సయ్య,ఉపసర్పంచ్ రాంరెడ్డి,వార్డ్ సభ్యులు,మాజీ సర్పంచ్ మాధవి రాజిరెడ్డి,జర్నలిస్టులు మహిపాల్ రెడ్డి,నర్సింహ రెడ్డి,గ్రామ పెద్దలు,గ్రామ యువకులు,గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 2025--26 రబీ వరి సేకరణ కు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని -జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



నిర్భయవార్త ప్రతినిధి : కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 2: 2025--26 రబీ సీజన్ కు సంబంధించిన వరి సేకరణ కార్యాచరణ ప్రణాళిక పై జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులు, రైస్ మిల్లుల యజమానులతో జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా , సమయపాలనతో కొనుగోలు ప్రక్రియ చేపట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సాగు విస్తీర్ణం ఉ ఉత్పత్తి అంచనా, జిల్లాలో ఈ రబీ సీజన్‌లో గణనీయమైన విస్తీర్ణంలో వరి సాగు చేయబడినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసిందని, హెక్టారుకు సగటు దిగుబడి ఆధారంగా మొత్తం ఉత్పత్తి అంచనా ప్రకారం, మార్కెట్ రాకపోకలు స్థానిక వినియోగం , విత్తన అవసరాలను మినహాయించి, మిగిలిన వరి మార్కెట్‌కు రానుందని. వరి మార్కెట్‌లోకి మార్చి చివరి వారంలో వస్తుందని ఏప్రిల్ మొదటి వారం లో ప్రారంభించాలని పేర్కొన్నారు. కొనుగోళ్ల వివరాలు, అవసరమైన గన్నీ సంచులు, తేమ కొలిచే యంత్రాలు, హామీ ధర చెల్లింపుల కోసం సాంకేతిక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తాగునీరు, నీడ, పారిశుధ్య సదుపాయాలు కల్పించాలని, కేంద్రాలలో వైద్య సిబ్బందిని నియమించి ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తేమ శాతం నిబంధనల ప్రకారం మాత్రమే కొనుగోలు చేపట్టాలని రైతులకు చెల్లింపులు నిర్దిష్ట కాలపరిమితి లో వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని, రవాణా, నిల్వ సదుపాయాలు ముందస్తుగా సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్ష లో అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లై అధికారి, వెంకటేశ్వర్లు, డి యం శ్రీకాంత్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, రైస్ మిల్లర్ల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ దేశాల వీడియోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయవద్దు

**ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ యూఏఈ అధ్యక్షులు బత్తిని రాజగౌడ్**




నిర్భయవార్త ప్రతినిధి :జగిత్యాల ప్రతినిధి, మార్చి 02 : ప్రస్తుతం గల్ఫ్ దేశాలలో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, టిక్ టాక్, ఫేస్ బుక్, ఇన్స్టా గ్రామ్, వాట్సాప్ గ్రూప్స్, స్టేటస్ లలో తమ తమ ఫోన్ లలో గల్ఫ్ లో ఫొటోస్ తీసి షేర్ చేయవద్దని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ యూఏఈ అధ్యక్షులు బత్తిని రాజగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. గల్ఫ్ రూల్స్ ప్రకారం సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడం నిషేధం అని తెలిపారు. మనం ఏ దేశాన ఉన్నా, ఆ దేశ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని రాజాగౌడ్ కార్మికులను కోరారు. కరోనా టైములోనే గల్ఫ్ దేశాల్లో మన కార్మికులందరినీ "సొంత బిడ్డల్లా" చూసుకుందన్నారు. ఏమి భయం లేదు, మిత్రులు ధైర్యంగా ఉండాలని గల్ఫ్ దేశాల్లో హెల్ప్ లైన్ నెంబర్లు పెట్టడం జరిగిందని తెలిపారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మీ కుటుంబ సభ్యులకు, మిత్రులకు ఫోన్ లేదా మెసేజ్ ద్వారా ఒక్క మాట తెలియజేయాలని సూచించారు. మీ ఇంట్లో వారికి కొండంత ధైర్యాన్నిస్తుందని అన్నారు. స్థానిక ప్రభుత్వాలు, రక్షణ శాఖలు జారీ చేసే అత్యవసర ఆదేశాలను (ఎమర్జెన్సీ అలర్ట్స్) ఖచ్చితంగా పాటించాలన్నారు. సాధ్యమైనంత మట్టుకు బయట తిరగకండని,అదేవిధంగా మీ మొబైల్ ఫోన్‌లను ఎల్లప్పుడూ ఛార్జింగ్ ఉంచుకోవాలని తెలిపారు. పాస్‌పోర్ట్, ఇతర ముఖ్యమైన పత్రాలను ఒక బ్యాగులో అందుబాటులో ఉంచుకోండని తోటి కార్మికులను రాజాగౌడ్ కోరారు.

# వ్యవసాయశీలో ఆధునిక పద్ధతులపై రైతులు శిక్షణా కార్యక్రమాలు జయప్రదం చేయాలి నల్లు సుధాకర్ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్



నిర్భయవార్త ప్రతినిధి : మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2 వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు అవలంబించే శిక్షణా కార్యక్రమాలను రైతులు ఉపయోగించుకోవాలని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు మరిపెడ డివిజన్



వ్యవసాయ కార్యాలయంలో అదనపు వ్యవసాయ సంచాలకులు విజయచంద్ర అధ్యక్షతన జరిగిన ఆత్మ కమిటీ సమావేశంలో సుధాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కమిటీ ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో 5,6, ల7 తేదీలలో ఆయా మండలాలలో రైతులకు రెండు రోజులపాటు వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు అవలంబించే విధానాలపై వ్యవసాయాన్ని నిపుణులచే శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నందున రైతాంగం ఉపయోగించుకోవాలని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం వినూత్నమైన కార్యక్రమాలను చాపడుతూ దళారీ వ్యవస్థ లేని మార్కెటింగ్ విధానాన్ని కూడా సమర్థవంతంగా నిర్వహిస్తూ, రైతాంగానికి వ్యవసాయం లాభసాటిగా మార్చే విధంగా చర్యలు చేపడుతుందని, కార్యక్రమాల్లో వ్యవసాయ అధికారులతో పాటు ఆత్మ కమిటీ డైరెక్టర్ చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారులు వీరాసింగ్, నరసింహారావు, వాహిని, చాయరాజ్, వినయ్ కుమార్ ,భాస్కర్, డైరెక్టర్స్ బొడ్డుపల్లి వెంకన్న కాలం శ్రీనివాస్ రెడ్డి చందులాల్, వెంకట్ రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.







# రాధికా.. సమ్మోహనం

**టిల్లు గాడి లవర్ అరాచకం**

డీజే టిల్లు సినిమాలో తన గడుసుతనంతో అందంతో టిల్లు గాడిని ముప్పతిప్పలు పెట్టిన రాధిక అలియాస్ నేహా శెట్టి ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. తాజాగా ఈ బ్యూటీ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన గ్రే స్కేల్ ఫోటోలు నెట్టింట సెగలు పుట్టిస్తున్నాయి. రాధికా.. ఏమది ఆ అందం! నేహా శెట్టి అంటేనే ఓ యూనిక్ టోన్డ్ ఫిజిక్, గ్లామర్ గుర్తొస్తుంది. తాజాగా ఈ సొగసరి షేర్ చేసిన ఫొటోల్లో గ్రేస్కేల్ లో దొరికిపోయాను అంటూ బ్లాక్ అండ్ వైట్ లుక్‌లో మెరిసిపోయింది. బాడీ హగ్గింగ్ దుస్తుల్లో తన స్కిన్‌ను ఫిగర్‌ను ఎలివేట్ చేస్తూ జెన్ జెడ్ ఫ్యాషన్ ఐకాన్‌గా కనిపిస్తోంది. గ్రే స్కేల్ ఫొటోల్లో కూడా నేహా కళ్లలో ఉన్న తీక్షణత, ఒంపుసొంపుల హొయలు అభిమానుల మనసు దోచుకుంటున్నాయి.నేహా శెట్టి సినీ ప్రయాణం మెహబూబా సినిమాతో మొదలైనా కానీ.. కెరీర్‌ను మలుపు తిప్పింది మాత్రం డీజే టిల్లు. ఆ సినిమాలో రాధిక పాత్రలో నేహా చూపించిన నెగటివ్ షేడ్స్ ఉన్న క్రూయెల్ గర్ల్ ఫ్రెండ్ పాత్ర యూత్ లో విపరీతమైన క్రేజ్ తెచ్చిపెట్టింది. నేహా ఇప్పుడు మరికొన్ని మీడియం బడ్జెట్ సినిమాల్లో కథానాయికగా నటిస్తోంది. తమిళంలో ప్రదీప్ రంగనాథన్ డూడ్ చిత్రంతోను నేహా కిక్ ఎలా ఉంటుందో పరిచయం చేసింది. కేవలం గ్లామర్ రోల్స్ మాత్రమే కాకుండా.. పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలు కూడా ఎంచుకుంటోంది.

[redacted]



యష్, కియారా

# రొమాన్స్ అదుర్స్

• టాక్సిక్ ఫస్ట్ సింగిల్ రిలీజ్



పాన్ ఇండియా స్టార్ యష్ , దర్శకురాలు గీతూ మోహన్ దాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. ఈ సినిమా ఈ నెల 19 న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి ఒ ఫస్ట్ సింగిల్ 'తబాహి' ని మేకర్స్ విడుదల చేశారు. యష్, కియారా అద్వానీల మధ్య సాగే ఈ రొమాంటిక్ సాంగ్ అందర్ని అకట్టుకుంటుంది.రీసెంట్‌గా రిలీజ్ అయిన హాట్ అండ్ రొమాంటిక్ పోస్టర్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే.షర్ట్ లెస్ లుక్‌లో యష్, ఆయనను బిగి కౌగిలిలో బంధించిన కియారా ఈ సాంగ్ లో ఈ ఇద్దరి కెమిస్ట్రీ 'నెక్స్ట్ లెవల్'లో ఉంది. ఈ చిత్రానికి విశాల్ మిశ్రా సంగీతం అందిస్తుండగా, యష్ పాత సినిమాల సెంటిమెంట్‌ను ఫాలో అవుతూ రవి బస్రూర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, ఒక స్పెషల్ సాంగ్ అందిస్తున్నారు. ఈ సినిమాలో కియారాతో పాటు నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా వంటి భారీ తారాగణం నటిస్తోంది.



# సంయుక్త క్లిక్

**కెమెరాతో స్నాప్స్**

హీరోయిన్ సంయుక్త గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అమాయకంగా కనిపిస్తూనే.. తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. తొలిసారి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, రానా కాంబినేషన్లో వచ్చిన 'భీమ్లా నాయక్' సినిమాలో రానా భార్య పాత్రలో నటించి ఆకట్టుకుంది. తెలుగు, తమిళ్ , కన్నడ, మలయాళం భాషల్లో నటిస్తూ మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. ఒకవైపు సినిమాలు చేస్తూనే మరొకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటోంది సంయుక్త మీనన్. ఈ మధ్యకాలంలో రోజుకొక గ్లామర్ ఫోటో షూట్ తో అభిమానులను ఆకట్టుకుంటుంది. అందులో భాగంగానే తాజాగా మోడ్రన్ డ్రస్ ధరించి తన అందాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అందులో కొంటెగా ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరుకి అభిమానులు సైతం ఫిదా అవుతున్నారు. అంతేకాదు స్వయంగా ఆమె తీసిన ఈ ఫోటోలను షేర్ చేస్తూ.. "కొంచెం సాఫ్ట్.. కొంచెం హాట్" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది.




# భయపెడుతూ.. నవ్విస్తూ!

**రాకాస టీజర్ అద్భుతం**

మెగా డాటర్ నిహారిక కొణిదెల తన సొంత బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పై నిర్మిస్తున్న తాజా చిత్రం రాకాస టీజర్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. గ్రిప్పింగ్ మూవీ టీజర్ రక్తి కట్టిస్తోంది. కథానాయకుడిలోని ఈజ్ కామెడీ సెన్స్ తో పాటు, థ్రిల్లింగ్ హారర్ ఎలిమెంట్స్ గగుర్పాటుకు గురి చేస్తున్నాయి..ఇతర హారర్ సినిమాల తరహాలోనే ఒక పాడుబడిన బూత్ బంగ్లా లేదా పాత కోటలోకి వెళ్లాక పరిణామాలు భయోత్పాతం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా ఇందులో నటించిన కథానాయకుడి పాత్ర ఆసక్తికరం. ఓ స్త్రీ రేపు రా.. అంటూ టీజర్ చివరిలో ట్విస్ట్ ఊహించని గగుర్పాటు. ఆ స్త్రీ రేపు వస్తుందో లేదో కానీ ఈరోజే తడిసిపోతుంది..! అనేంతగా టీజర్ రక్తి కట్టించింది. ఇందులో ఆసక్తికరమైన డైలాగ్స్ , విజువల్స్ చూస్తుంటే, ఈ సినిమా హారర్ కామెడీ జోనర్‌లో ఒక కొత్త ట్రెండ్ సెట్ చేసేలా కనిపిస్తోంది. గ్రిప్పింగ్‌గా సాగుతున్న ఈ టీజర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తూ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఈ సినిమాలో కథానాయకుడు సంగీత్ శోభన్ తనదైన ఈజ్, కామెడీ సెన్స్‌తో ఆకట్టుకుంటున్నాడు.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197